Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 30 - No.11

September 2024



## ధన్యతల్లో దాగి ఉన్న మౌలిక విలువలు

సంపాదకీయం

# గతం ప్రస్తుతాన్ని ప్రభావితం చేయాలి

చరిత్ర ప్రభావం మనపై అనేక రకాలుగా ఉంటుంది. చరిత్ర నుంచి అమూల్యమైన పాఠాలు నేర్చుకోవచ్చు. స్ఫూర్తిని పొంది, భవిష్యత్తును అర్థవంతంగా కొనసాగేలా మలచుకోవచ్చు. అందుకే 'చరిత్ర మనుషుల్ని జ్ఞానవంతులుగా చేస్తుంది' అని చెప్పిన ఫ్రాన్సిస్ బేకన్ మాటలు సబబే అనిపిస్తుంది. గత 70 ఏళ్ళలో యుఇయస్ఐకి అద్భుతమైన ఘన చరిత్ర ఉంది. దేవుడు చేసిన ఆశ్చర్యకార్యాలు, అడుగడుగునా ఆయన చూపిన నమ్మకత్వం, సంరక్షించిన హస్తాన్ని చూసినప్పుడు మనలో ఆరాధనా భావం, అణకువ, ఆచరణాత్మకమైన జీవితాన్ని తీసుకురావాలి. లేకపోతే గత వైభవాన్ని గురించి అతిశయిస్తూ, ప్రస్తుత బాధ్యతను విస్మరించే ప్రమాదం ఉంది.

1954లో యుఇయస్ఐ పరిచర్య ప్రారంభమైంది. యుఇయస్ఐకి దేవుడు విజన్, మిషన్, లక్ష్యాలు, ప్రత్యేకతలు, సైద్ధాంతిక ఆధారాల్ని ఇచ్చాడు. వాటికి అనుగుణంగా మన పితరులు దేవుని భయంతో, ఎంతో పరిశుద్ధంగా జీవిస్తూ, ప్రభువిచ్చిన దర్శనం ప్రకారం కన్నీటి ప్రార్థనతో సువార్తను విద్యార్థుల మధ్య నాటారు, నీరు పోశారు. దేవుడు ఈ పరిచర్యను ఊహించని రీతిగా అభివృద్ధి చేశాడు. ఇప్పుడు ఈ పరిచర్య బాధ్యతను దేవుడు మనకప్పగించాడు. మనం ఎలా చేస్తున్నాం? మనం ఎలా నాటుతున్నాం? ఎలా నీరు పోస్తున్నాం? దేవుడు మనం చేసే పనిని పరీక్షిస్తే అది నిలుస్తుందా? కాలిపోతుందా?

యుఇయస్ఐలోని పితరులు, తర్వాత తరం నాయకులు తమ అవసరాలకు, స్వార్థానికి దేవునిని, మనుష్యుల్ని వాడుకోలేదు, దేవునిచేత వాడబడ్డారు. వ్యక్తుల్ని వారి స్థాయి, అర్హత, నైపుణ్యాలను బట్టి గాక, నిస్వార్థంగా ప్రేమించి, శ్రద్ధను చూపించారు. తమ స్వచిత్తాన్ని సిలువకు కొట్టి తమ జీవితాల్ని క్రీస్తు కేంద్రంగా మలచుకొన్నారు. వారి చదువుల్లో, వివాహాల్లో, ఉద్యోగాల్లో దేవునిని మహిమపరిచారు. దేవుని వాక్యానికే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. దేవుని పని కోసం వారి గృహాలు తెరిచారు. పరిచర్య కోసం డబ్బును ధారాళంగా ఖర్చు పెట్టారు, త్యాగపూరితంగా జీవిస్తూ సుఖాలను వదులుకొన్నారు. పరిచర్యలో బరువులు మోసారు, బంధాలు పెంచుకున్నారు. శరీరానుసారమైన అనుబంధాలు తుంచుకొన్నారు, అవినీతిని ఎదిరించారు. ఎదురైన అవమానాల్ని భరించారు. ప్రభువు కోసం పరుగెత్తారు, ప్రయాణాలు చేశారు, క్రొవ్వొత్తిలా కరిగిపోయారు. సంఘాన్ని, సమాజాన్ని ప్రభావితం చేశారు. దావీదువలె తమ తరానికి గొప్ప సేవ చేశారు. యుఇయస్ఐ పితరులు నాడు చూపించిన ఈ జీవనశైలినే నేడు మనం మౌళిక విలువలుగా నేర్చుకొంటున్నాము.

20 సంవత్సరాల క్రితం విద్యార్థి జ్వాల దీనబంధు గారిని ఒక ఇంటర్వ్యూలో "ప్రారంభంలోని పరిచర్యకు ఇప్పటి పరిచర్యకు ఉన్న ప్రాథమిక బేధం ఏంటి?" అని అడిగినప్పుడు 'ఆ రోజుల్లో వ్యక్తిగత సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉండేవి. స్టూడెంట్స్, స్టాఫ్, గ్రాడ్యుయేట్స్ మధ్య మంచి సంబంధాలు, ఎంతో గొప్ప ప్రేమ ఉండేది. ఈ రోజుల్లో అది కొంత తగ్గుతుందేమోనని అనిపిస్తుంది" అని చెప్పారు.

ప్రస్తుతం అనేక ఇయు, ఇజియఫ్‌లలో సహవాసంలో ప్రేమ, ఆప్యాయతలు, వ్యక్తిగత శ్రద్ధలు కనుమరుగై, ఆచారంగా జరిగే కార్యక్రమాలకు, రూల్స్‌కు ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పవచ్చు. ఫాలోఅప్, మెంటరింగ్, యంపిసిలు మొక్కుబడి కార్యక్రమాల్లా జరుగుతున్నాయి. ఫలితంగా ఇయు, ఇజియఫ్‌లు నాణ్యతను, ప్రభావాన్ని కోల్పోతున్నాయి.

విలియం ఆర్థర్ వార్డ్ అనే రచయిత ఇలా అంటాడు "నన్ను ఎవరైనా పొగిడితే నేను నమ్మక పోవచ్చు, నన్ను ఎవరైనా విమర్శిస్తే నేను ఇష్టపడక పోవచ్చు. నన్ను ఎవరైనా చిన్నచూపు చూసినా, పట్టించు కోకపోయినా నేను తట్టుకోలేను, క్షమించలేను, కానీ ఎవరైనా నన్ను ప్రేమించి, ప్రోత్సహించి, శ్రద్ధ చూపిస్తే నేను వారిని ఎన్నడూ మరచిపోను." యుఇయస్ఐ పరిచర్య ఆధ్యాత్మికతకు, ప్రేమ, ఆప్యాయతలు, వ్యక్తిగత శ్రద్ధకు పెట్టింది పేరు. గనుక వీటిని నిర్లక్ష్యం చేయకూడదు. మన పితరులు యేసుక్రీస్తు వలె ప్రేమించడం, ప్రోత్సహించడం, శ్రద్ధ చూపించడం అనే మాదిరిని చూపిస్తూ వాటితో పరిచర్యను పటిష్టం చేశారు. ప్రస్తుత తరం కూడా ఇదే మాదిరిని కొనసాగిస్తే పరిచర్యలో అద్భుతమైన నాణ్యతను, వృద్ధిని చూస్తాం.

"పితరులు మంచి సిద్ధాంతాలతో, మౌళిక విలువలతో సంఘాలను, సంస్థలను కడితే శరీరానుసారులు వారి జీవితాలతో, పనులతో, నిర్లక్ష్య వైఖరితో వాటిని కూలదోస్తున్నారు" అని అంటాడు ఒక భక్తుడు. మనం కట్టేవారమా? కూలదోసే వారమా?

గతం ప్రస్తుతాన్ని ప్రభావితం చేయాలి. భవిష్యత్ కోసం మనల్ని బలోపేతం చేయాలి. గత వైభవాన్ని తలచుకొంటూ ప్రస్తుత బాధ్యతను విస్మరిస్తే అవి ప్రగల్భాలే అవుతాయి. కానీ పని మాత్రం శూన్యం అవుతుంది. మనం ఇలాంటి ప్రమాదంలోకి వెళ్ళకూడదు. ప్రమాదాన్ని చూస్తూ చూస్తూ ఎవరూ కొనితెచ్చుకోరు. నిర్లక్ష్యంగా ఉండేవారు తప్ప.

**– పి. సునీల్ జాకబ్,** అసోసియేట్ ఎడిటర్

# విద్యార్థి జ్వాల



Vol. 30, No. 11 September 2024
A Publication of
Union of Evangelical Students of India

EDITORIAL BOARD:
Mr. B.J. Lazarus, Editor
Mr. P. Sunil Jacob - Associate Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Mr. C. Paul Pramod, Member
Mr. K. Adam - Sec., Litt.Dept.

SUBSCRIPTION CHARGES:
STUDENTS (1 Year) - Rs. 150
GRADUATES (1 Year) - Rs.300
STUDENTS (3 Year) - Rs. 400
GRADUATES (3 Year) - Rs.850
STUDENTS & GRADUATES (10 Years) Rs. 2000/-

FOR SUBSCPRICTION:
The prescribed subscription charges can be paid using the account / UPI id / QR code, fill the details in the google form (https://bit.ly/SubscriptionForVJ) and inform the same to Editor VJ through whatsapp.

**Account No: 36698741798**
**Account Name: uesiap vj**
**IFS Code: SBIN0011994**
**SBI Nambur Branch**
**UPI ID: uesiapvj@sbi**

CONTACT:
The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

## ధన్యతలు

| షరతు | ఫలితం |
|---|---|
| ❖ ఆత్మవిషయమై దీనత్వం | ❖ పరలోకరాజ్యం వారిది |
| ❖ దు:ఖపడువారు | ❖ ఓదార్చబడతారు |
| ❖ సాత్వికులు | ❖ భూలోకమును స్వతంత్రించుకొంటారు |
| ❖ నీతికొరకు ఆకలిదప్పులు | ❖ తృప్తిపరచబడతారు |
| ❖ కనికరము | ❖ కనికరము పొందుతారు |
| ❖ హృదయశుద్ధి | ❖ దేవుని చూస్తారు |
| ❖ సమాధానపరచేవారు | ❖ దేవుని కుమారులు అనబడతారు |
| ❖ నీతి నిమిత్తము హింసింపబడేవారు | ❖ పరలోక రాజ్యము వారిది |
| ❖ దేవుని నిమిత్తం నింద, హింస పొందితే | ❖ పరలోకంలో అధికఫలం పొందుతారు |

## లోపలి పేజీల్లో...

- గతం ప్రస్తుతాన్ని ప్రభావితం చేయాలి - 2
- సెప్టెంబర్ సంబరాలు- 4
- ధన్యతల్లో దాగి ఉన్న మౌళిక విలువలు - 5
- యుఇయస్ఐ మౌళిక విలువలు - 9
- సేవక నాయకులను తర్ఫీదు చేయడం - 11
- సిద్ధంగా ఉండు - 14
- శరీర సంబంధి-ఆత్మసంబంధి - 16
- ధన్యతలు - 19
- టీన్స్ పెంపకం ఓ తియ్యని సవాలు - 20
- క్రికెటర్ సిటి స్టడ్ - 22
- వారసత్వాన్ని అందించు - 23
- డిటి క్యాంప్ నా జీవితంలో ఓ టర్నింగ్ పాయింట్ - 26
- ప్రత్యేకంగా జీవించండి - 28
- (అ) పరిచితులు - 31
- విద్యార్థి నాయకుడా - 32

# సెప్టెంబర్ సంబరాలు

వర్షించకుండానే వెళ్ళిపోయిన మేఘంలా
జ్వలించకుండానే ఆరిపోయిన దీపంలా
మట్టిలో తలాంతుల్ని పాతేసుకొని
నీలోని అగ్నిని లోలోనే ఆర్పేసుకొని
ఒక చిరునవ్వునైనా వెలిగించకుండా
ఒక భుజాన్నైనా ఆప్యాయంగా తట్టకుండా
ఈ లోకాన్ని వదిలి వెళ్తావా? (తాళ్ళూరి రచన)

సెప్టెంబర్ నెల మన పరిచర్యలో సంబరాలు చేసుకొనే నెల. దానికి ప్రధాన కారణం మహాజ్ఞానియైన మన దేవుడు ప్రొ. ఇనాక్ గారిని ఎన్నుకొని విద్యార్థుల వికసించే జీవితాలకు, విప్లవాత్మక జీవితాలకు పునాది వేయడమే. ప్రారంభం మన బలం, కొనసాగించలేక పోవడం మన బలహీనత. ఆంధ్రులు ఆరంభ శూరులు అనే నానుడికి స్వస్తి చెప్పి, ఆంధ్రులు అంతిమ విజయాన్ని సాధించే వరకు విశ్రమించరు అనే కొత్త సామెతను మనం సృష్టించాలి. 'ఆంధ్రులదే అంతిమ విజయం' అనే నానుడికి మన తరం పునాది వేసి, కొనసాగించాలి. ఇలా చేసేందుకు మన ఇనాక్ గారి జీవితం మనకెంతో ఆదర్శం, ప్రోత్సాహం.

విద్యార్థి పరిచర్యను విశ్వవిద్యాలయాల్లో విస్తరింపజేయడానికి, తద్వారా విద్యార్థుల జీవితాలను వికసింపజేయడానికి ఇనాక్ గారు పాటించిన ఒక సూత్రం – యేసుక్రీస్తు కొండమీద చేసిన ప్రసంగాన్ని అనుదిన జీవితంలో పాటించడం. ఆశ్చర్యపరచే తన విశ్వాస జీవితం, అందులో భాగంగా అనుదిన అవసరాలకు సంపూర్ణంగా దేవునిపై ఆధారపడడం, క్రీస్తులా వ్యక్తుల్ని ప్రేమించి, వారిని ప్రోత్సహించడం తన జీవితంలో ప్రాముఖ్యమైన విషయాలని అర్థమవుతుంది.

ఇవాంజిలిస్టిక్ క్యాంప్స్, ఫాలోఅప్స్‌లో నిమగ్నమైన మనం నూతన విశ్వాస విద్యార్థులను క్రీస్తు కొరకు జీవించేలా ప్రోత్సహించాలి. ఈ ప్రోత్సాహం మన మాటలతో పాటు, మార్గదర్శక జీవితంలో కూడా ఈ కొత్త తరం చూడగలిగితే ఆధునిక ఇనాక్‌లను మనలో కనుగొంటారు. వారు కూడా ఆధునిక ఇనాక్‌ల వలె జీవిస్తే ఆంధ్రప్రదేశ్‌కు ఆశీర్వాదం, భారత దేశానికి బంగారు భవిత ఉంటుంది. యుఇయస్‌ఐ ఫార్మేషన్ డే సందర్భంగా మన విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ మరోసారి ప్రభువుకు, పరిచర్యకు పునరంకితం చేసుకొని ప్రతిజ్ఞతో జీవిస్తే దేవుడు బహుగా సంతోషించి మన పరిచర్య ప్రగతి పథంలో వెళ్ళేందుకు సహాయం చేస్తారని విశ్వసిస్తున్నాను.

"తనకు పరిపూర్ణంగా ప్రతిష్ఠించుకొన్న వ్యక్తి ద్వారా దేవుడు ఏమి చేయగలడో ప్రపంచం ఇంకా చూడలేదు. దేవుని సహాయంతో, నేను ఆ వ్యక్తిగా ఉండాలని లక్ష్యం పెట్టుకొన్నాను" అని అంటారు డియల్ మూడి.

ప్రభువుకు పరిపూర్ణంగా ప్రతిష్ఠించుకొన్న డియల్ మూడి గారే కాకుండా, మన ఇనాక్ గారి పరిచర్యను కూడా దీవించిన దేవుని ప్రోత్సాహంతో శేష జీవితాన్ని ఆయన ఉద్దేశాల నెరవేర్పుకై పునరంకితం చేసుకొందాం.

ఈ లోకాన్ని వదిలి వెళ్ళేముందు ఒక చిరునవ్వునైనా వెలిగించి, ఒక భుజాన్నైనా ఆప్యాయంగా తట్టి వెళదాం.

సెప్టెంబర్ సంబరాలు సర్వోన్నతుని స్వప్నం నెరవేరడానికి సత్యంగా, సంతోషంగా జరుపుకొందాం...

ఆయన ప్రణాళికలో మీ....

ఆర్. శ్రీనివాస్
యుఇయస్‌ఐ–ఏపి స్టేట్ సెక్రటరీ, గుంటూరు





# ధన్యతల్లో దాగి ఉన్న మౌలిక విలువలు

మత్తయి 5:3-11

మనుష్యులకు ఆశీర్వాదాలు పొందడం చాలా సంతోషం. భక్తుల తలపై చేయిపెట్టి ప్రార్థిస్తే ఆశీర్వాదాలు వస్తాయని నమ్మే విశ్వాసులు కోకొల్లలు. ఫలానా విధంగా ప్రార్థిస్తే లేక చేస్తే ఆశీర్వాదాలు వస్తాయని ఎవరైనా తెలియచేస్తే, ఎంత కష్టమైనా, ఎంత ఖర్చు అయినా చేయడానికి, ఎంత దూరమైనా వెళ్ళడానికి వెనుదీయని క్రైస్తవులు, విశ్వాసులని చెప్పుకునేవారు చాలామంది. మన భారతదేశంలో ఈ విధమైన బోధలతో మనుష్యులను మోసగించి కోట్లకు పడగలెత్తిన దొంగ బాబాలు, టివి బోధకులకు లెక్క లేదు. ప్రజలు ఆశీర్వాదాల కోసం పడే తపన, ఆతురత వారి అజ్ఞానంలో నుండి, స్వార్థంలో నుండి వచ్చినవే. చాలా మందికి ఆశీర్వాదాలు, కృపలకు మధ్యగల భేదం తెలియదు. పాత నిబంధనలోని సంఘటనలు, విషయాలు క్రొత్త నిబంధనలోని వాస్తవికతకు ఛాయరూపాలని దైవవాక్యం స్పష్టంగా బోధిస్తుంది (కొలస్సీ 2:17). పాతనిబంధనలోని భౌతిక సంపద, వస్తు సామాగ్రి, బంగారం, వెండి, పశుసంపద క్రొత్తనిబంధనలోని ఆత్మీయజీవితములో దేవుడనుగ్రహించే సువర్ణము కన్నా విలువైన విశ్వాసము, విలువ కట్టలేని నిత్యజీవము, డబ్బుతో కొనలేని సంతోష సమాధానాలు, దేవుడు తన ప్రాణమును అర్పించి సంపాదించిన నిత్య క్షమాపణ మొదలగు ఆశీర్వాదాలకు ఛాయరూపకంగా ఉన్నవని గ్రహింపగలం. ఆ కారణం చేత, నూతన నిబంధన ప్రారంభంలోనే పరిశుద్ధాత్మ దేవుడు, ఒక వ్యక్తి నిజంగా ఆశీర్వదించబడడం అంటే ఏంటో, ఆశీర్వాదాన్ని అనుభవించడానికి గల నిబంధనలేంటో రాయించి పెట్టాడు. మత్తయి 5:3–11లో పేర్కొన్న ఎనిమిది ధన్యతలు/ఆశీర్వాదాల గురించి కొద్దిసేపు ఆలోచిద్దాం.

ఆత్మవిషయమై దీనులైన వారు ధన్యులు. పరలోకరాజ్యము వారిది అని చెప్పడంలో దేవుని రాజ్యానికి ఒక వ్యక్తి ఏవిధంగా వారసుడు కాగలడో, ఈ అద్భుత ఆశీర్వాదానికి పాత్రుడవడానికి గల షరతులను స్పష్టంగా చెప్పారు. ఒక వ్యక్తి దేవుని ఆశీర్వాదాలకు హక్కుదారుడు కావాలంటే అతడు ఈ మార్గం ద్వారా రావలసిందే! దేవునితో ఒక వ్యక్తికి సంబంధం ఏర్పడడం ఆశీర్వాదాలకు ప్రారంభం. బైబిల్‌లోని సారమంతా ఇదే! ఈ లోకములో ఆశీర్వదించబడిన వారు ఎవరు? ధనవంతులా? శక్తిమంతులా? దీర్ఘాయుష్మంతులా? వీరెవ్వరూ కాదు, కేవలం దేవునితో సంబంధం గల వారు మాత్రమే!

ఆత్మ విషయమై బీదలైనవారు తమ ఆత్మీయ దారిద్ర్యమును గుర్తించి, దేవుని ఎదుట తమ ఆత్మీయ అపరిపక్వతను ఒప్పుకొన్నవారు. ఈ ఒప్పుదల వారిలో కలిగించినది పరిశుద్ధాత్మ దేవుడే. ఈ ఎరుక వారిలో లోతైన పశ్చాత్తాపాన్ని కలిగిస్తుంది, తమ పాపస్థితిని అసహ్యించుకొనేటట్లు చేస్తుంది, దేవుని ముందు వారు దోషులని ఒప్పుకునేటట్లు చేస్తుంది, ఆకాశమువైపు తల ఎత్తుకోవడానికి

**మనలను కష్టపెట్టిన వారిని క్షమించడం, మనకు కీడు చేసిన వారికి మేలు చేయడం లోకములో చదువు వలనగాని, తెలివితేటల వలనగాని వచ్చే విద్యకాదు. ఇది పరిశుద్ధాత్మ దేవుడు ఒక వ్యక్తి తననుతాను ఆయనకు అప్పగించుకున్నప్పడు అతనికి అనుగ్రహించే గొప్ప ఆశీర్వాదం.**

ధైర్యము లేని వారుగా చేస్తుంది, దేవుడు మానవుని పతన/ పాప స్థితిని ఏవిధంగా చూస్తాడో ఆవిధంగా చూడడానికి సహాయం చేస్తుంది. తద్వారా రక్షకుని అక్కర వానిలో పుట్టిస్తుంది. రక్షకుని పాదాలపై పడి క్షమాపణ అర్థించేటట్లు చేసి, దేవుడు ఉచితంగా అనుగ్రహించు క్షమాపణకు, నీతికి వారసులుగా చేసి దేవుని రాజ్య నివాసులుగా చేస్తుంది. నిత్యమైన అగ్నిగుండం నుండి శాశ్వతంగా విడుదల కలిగి స్తుంది. దేవుని కుటుంబంలో సభ్యులుగా చేస్తుంది. ఇంతకన్నా గొప్ప ఆశీర్వాదం ఏమి ఉంటుంది!

దు:ఖపడు వారు ధన్యులు వారు ఓదార్చబడుదురను ఆశీర్వాదము మొదటి ఆశీర్వాదముతో ముడిపడి ఉంటుంది. ఒక పాపి తన ఆత్మీయస్థితి, దాని పర్యవసానం గుర్తించిన తర్వాత దు:ఖించకుండా ఉండలేడు. లోతైన పశ్చాత్తాపం మానవునిలో అవసరమైన దు:ఖం తీసుకొని వస్తుంది. ఇది దేవుని రాజ్య నిర్మాణానికి పునాదిలాంటిది. దేవుని ముందు తాను అంగీకరించ బడడానికి తన దగ్గరేమీలేదని గుర్తించిన మానవుని గుండెలోనుండి దు:ఖము, బాధ పెల్లుబికి వస్తాయి. పాపము వాని జీవితానికి ఏమి చేసిందో, దేవున్ని ఎంత బాధపరచిందో గ్రహించినప్పుడు గుండెలవిసేటట్లు విలపించుట, దు:ఖించుట జరుగుతుంది. ఈ దైవిక దు:ఖము మారుమనస్సుకు నడిపిస్తుంది.

మనుష్యులు తమ జీవితాలలో కోరుకున్నది దక్కనప్పుడు, తమ ఆశ భంగమై పోయినప్పుడు, తమ కలలు కూలిపోయినప్పుడు, తమ ప్రియు లను కోల్పోయినప్పుడు పొందే దు:ఖం గూర్చి ప్రభువు మాట్లాడడం లేదు. అటువంటి దు:ఖము మరణకరమైనదని 2 కొరింథీ 7:10లో రాయబడి ఉంది. పశ్చాత్తాపానికి నడిపించే దైవిక దు:ఖము నిత్య సంతోషానికి నడిపిస్తుంది. యాకోబు 4:9,10 వచనాలలో రాయబడిన దు:ఖము ఇటువంటి దు:ఖమే. ఈ దు:ఖము గొప్ప ఆశీర్వాదానికి పాత్రులు గా చేస్తుంది. ఈ దు:ఖము యొక్క అనుభవము లేక ఎన్ని బతుకులు యుగయుగాలు అరుస్తూ, పండ్లు కొరుకుతూ ఉండే స్థలానికి వెళ్తున్నారో లెక్కలేదు. నాకు, నీకు ఈ దు:ఖము కలుగచేసి ఆశీర్వదించిన ప్రభువుకు కృతజ్ఞతలు. మనము ఓదార్చబడ్డాము. ఓదార్చబడిన వారి కళ్ళు ఇంకా కన్నీరు కారుస్తూ దేవుని పాదములను ఆశ్రయించి ఓదార్చబడని అనేకుల కొరకు ప్రార్థించాలని, వారి కన్నీటిలోనుండి అనేక గృహాలలోనికి ఆశీర్వాదం ప్రవహించాలని దేవుని కోరిక. వారు కన్నీటితో విత్తి సంతోష గానముతో పనలు మోసికొని రావాలని దేవుని ఆశ (కీర్తనలు 126:5,6). ఈవిధంగా తమ తరములో వారు ఆ ఆశీర్వాదానికి నిలయంగా మారాలని దేవుని ఆశయం. నీవు ఆ ఆశయ సిద్ధికి సహకరించగలవా?

సాత్వికం బలహీనత కాదుగాని అది నియంత్రించబడిన మహాశక్తి. దెబ్బకు దెబ్బకొట్టి, తన పోరాట పటిమ ద్వారా పదిమందిని జయిం చడం హీరోయిజంగా చూపించే ఈ లోకంలో సాత్వికమనే ఆశీర్వాదం కోరుకొనే వారెందరు? ఈ ఆశీర్వాదంలోనే మనుష్యుల మనసులను జయించే అద్భుత రహస్యం దాగి ఉంది. దేవుడనుగ్రహించిన పరిస్థితులను మౌనంగా అంగీకరించి దేవుని కొరకు ఓర్చుకునే శక్తి గొప్ప ఆశీర్వాదం. పగతీర్చు కోకుండా, క్షమించి, ఓర్చుకునే ఈ శక్తిముందు కఠిన హృదయాలు కరిగిపోవలసిందే! సాత్వికులు క్రీస్తు ప్రభువు కాడి క్రింద తమ మెడను వంచి ఆయన దగ్గరే నేర్చుకుంటారు. ఆయనలాంటి సాత్వికుడెవరైనా ఉన్నారా? సాత్వికుడు చేతకాని వాడుకాదు, దేవుని కొరకు చేతకానివాని వలె సహించుకొంటాడు. ప్రపంచాన్ని ఇనుప దండంతో పరిపాలించిన రాజ్యాలను వణికించిన రోమా సామ్రాజ్యం, సాత్వికులకు తల ఒగ్గక తప్పలేదు. ఈ సాత్విక సమూహమే వెయ్యేండ్ల పరిపాల నలో ప్రపంచాన్ని ఏలుబడి చేస్తారు. ఆశబోతులు, కబ్జాకోరులు, అధికార దాహంతో గర్వంతో మీసాలు మెలేసే వారు, తొడలు చరిచి సవాలు చేసేవారు

దేవుడు సాత్వికులకు ఈ భూమిని అప్పగించినప్పుడు వారు ఉనికిలో ఉండరు.

కామ, ధన దాహంతో నిండిన ఈ లోకములో నీతికొరకు ఆకలి దప్పులు కలిగి ఉండడం ఎంతభాగ్యం! ఎంత ఆశీర్వాదకరం! ఏ వాణిజ్య ప్రకటనలోనైనా, టివి కార్యక్రమాలలోనైనా కామ వాంఛను ప్రేరేపించే దృశ్యాలే ఎక్కువ. ఆ ఆకలిని తీర్చడానికి ఎన్నో కేంద్రాలు రాత్రింబవళ్ళు పని చేస్తున్నాయి. తిండి లేకపోయినా, టివి, సెల్‌ఫోన్ లేకపోతే బతకలేని ఈ సమాజానికి నీతిని గురించి పరిశుద్ధతను గురించిన శ్రద్ధ ఎలా వస్తుంది? నీతిగల పరిశుద్ధ దేవుని కొరకైన తృష్ణ, ఆయన మార్గాలు, ఆయన చిత్తము కొరకైన ఆకలితో ఉన్న వారికి ఆయన తృప్తినిచ్చి వారి ఆకలి తీరుస్తాడు. ధనదాహం, ధనాశ గురించి వేరుగా చెప్పనవసరం లేదు. ఈ ఆకలి మానవులను చేయరాని కార్యాలు చేయడానికి త్వరపెడుతుంది. ధనాశ సమస్త కీడులకు మూలమని దైవవాక్యం ఘోషిస్తూనే ఉంది. కానీ ఎన్ని అడ్డదారులైనా త్రొక్కి తమ ధనదాహం తీర్చుకోవడానికి పరుగులెత్తే సమాజంలో నీతి కొరకు ఆకలి, దాహం కలిగిన వ్యక్తులు గొప్ప ఆశీర్వాద కారకులు. వారు చింతలేని వారు, శాంతి అనుభవించేవారు, ఉన్న దానితో తృప్తి చెంది సమాధానంతో నిద్రించేవారు. తన ప్రియులు నిద్రించుచుండగా వారి ప్రభువు వారికిచ్చుచున్నాడు (కీర్తనలు 127:2). మానవ జ్ఞానానికి అర్థం కాని దేవుని శాంతితో వారి తలంపులను ఆయన కాపు కాయుచున్నాడు (ఫిలిప్పీ4:7). వారికుడి ప్రక్కను పదివేలమంది పడినను వారి ఎడమ ప్రక్కను వేయిమంది పడినను అపాయము రాకుండా తన దూతలను వారి చుట్టు కావలి యుంచి రక్షిస్తాడు (కీర్తనలు 91:7; కీర్తనలు34:7). ఎంత గొప్ప ఆశీర్వాదము!

తప్పు చేసినవారిని రాళ్ళతో కొట్టి, మాటతో చీల్చివేసే ఈ సమాజంలో “కనికరము” అనేది దొరకని వస్తువు. తన ప్రభువును పోలి, కళ్ళనిండా, చేతలలో, మాటలలో కనికరము చూపించి, తప్పు చేసిన వ్యక్తిని సమీపించి భుజముపై చెయ్యివేసి ప్రేమతో కళ్ళల్లోకి చూస్తూ ఆ వ్యక్తి కన్నీరు తుడవగల, ఆదరించే, ధైర్యపరచగల వ్యక్తులు ఎంత ఆశీర్వదింపబడిన వారో! వారి కరచాలనంలో కనికరం ఉట్టిపడుతూ, అందరూ తనను దోషిగా చూస్తున్నప్పుడు కనికరంతో వారి పెదవులలోనుండి జాలువారే దయగల మాటలు ఎన్ని హృదయాలను ఆదరిస్తాయో! ఈ కదిలే ఆశీర్వాద దీపికలు మన సహవాసంలో కనుమరుగై పోవడం మనపాలిట శాపం. మనలను కష్టపెట్టిన వారిని క్షమించడం, మనకు కీడు చేసిన వారికి మేలు చేయడం లోకములో చదువు వలనగాని, తెలివితేటల వలన గాని వచ్చే విద్యకాదు. ఇది పరిశుద్ధాత్మ దేవునికి ఒక వ్యక్తి తననుతాను అప్పగించుకున్నప్పుడు అతనికి అనుగ్రహించే గొప్ప ఆశీర్వాదం.

హృదయశుద్ధి అనేది పాపరహిత జీవితమని కాదు గాని యధార్థమైన, మిశ్రమ రహిత జీవితం. బయట, లోపల ఒకే జీవితం. అంతరంగంలో ఖచ్చితమైన దృక్పథం, గురి, తీర్మానాలు గల జీవితం. లోకములో ఇలాంటి జీవితాలు కనబడవు. బాహ్యంగా శుద్ధిగా, యధార్థంగా కనపడేవారు అనేకులు. కాని వారి జీవితాలు, కుటుంబాలు మేడిపండు పోలికే. క్రీస్తు ప్రభుని బోధన సారం యధార్థ జీవితం గురించే. ఈ జీవిత ప్రారంభం మారుమనస్సుతో మొదలు పెట్టి పరిశుద్ధాత్మ దేవుడు వారి మనస్సాక్షిని శుద్ధిచేసి, దేవునితో వారు తమ సహవాసాన్ని కొనసాగిస్తున్నప్పుడు వారిలో గొప్ప రూపాంతరాన్ని కలగచేసి యధార్థతను వారి అంతరంగ బాహ్య జీవితాలలో కలగచేయుటయే ఈ గొప్ప ఆశీర్వాదము. ఇట్టివారు దేవుని స్వరూప

> **శరీరాశ తీర్చుకోవడానికి లోక వ్యవస్థలో అనేక అవకాశాలు దొరుకుతాయి. శరీరం అల సిపోకూడదు, శ్రమ కలగకూడదు, చేతులకు మురికికాకూడదు, విశ్రాంతి సుఖభోగాలు అమలు జరపాలి - ఇవే లోక వ్యవస్థలోని కొన్ని సూత్రాలు. ఇవి జరగడానికి నీతిని, యధార్థతను, క్రమమును, క్రమ శిక్షణను, పరి శుద్ధతను విస్మరించమని లోకవ్యవస్థ బోధిస్తుంది, అనుకరిస్తుంది.**

దర్శనాన్ని కలిగి ఉంటారు. దేవుని సత్యాన్ని అర్థంచేసుకుని పౌలు చెప్పినట్లు ఆయనను, ఆయన పునరుత్థాన బలాన్ని ఎరుగుటకు శాయశక్తుల ప్రయత్నిస్తారు. వారిజీవితాలు వారిలోని దేవునిని ఇతరులకు చూపిస్తాయి. ఎంత అద్భుత ఆశీర్వాదం!

దేవుని కుమారుడు మానవుడిని దేవునితో సమాధాన పరచి ఇరువురిని ఏకం చేశాడు. యూదులు, అన్యులు క్రీస్తు ప్రభుని సిలువ దగ్గర ఒక్క గుంపు అనగా సంఘముగా ఏకము చేయబడ్డారు. ఆయన మరణం మనుష్యులకు క్షమాపణ యొక్క అర్థాన్ని బోధించింది. ఆయన మరణం వలన దేవునితో సమాధాన పరచబడినవారు, సమాధానకారకులుగా మార్చబడి సమాజానికి, సంఘానికి గొప్ప ఆశీర్వాదంగా మారతారు. లోకములో, సమాజంలో విభజన, కలహము సామాన్య దృశ్యాలు. ఇవి విశ్వాస సంఘంలోనికి ఇయు, ఇజియఫ్‌లలోనికి, కుటుంబాలలోకి వ్యాపించాయి. స్వార్థం చనిపోతేనే ఇద్దరు శత్రువులు ఒక్కటై కలిసిపోతారు. ఇలా ఎవరు శత్రువులను కలుపగలరు? ఇలా ఎవరు ఇద్దరు శత్రువులకు నిజమైన క్షమాపణ గురించి వివరించగలరు? వారికోసం కన్నీరుకార్చి, ప్రార్థించి దేవుని శాంతిని, ప్రేమను వారి మధ్య ఎవరు ప్రవహింపచేయగలరు? చాలా కొద్దిమంది మాత్రమే ఈ గొప్పఆశీర్వాదం కలిగి ఉంటారు. వీరు ఎక్కడ ఉంటే అక్కడ సమాధానం రాజ్యమేలుతుంది. ఏకత్వం ఉంటుంది, విభేదాలు విడిపోతాయి. సంతోషం పరవళ్ళు త్రొక్కుతుంది. చేతులు, మనసులు కలుసుకొంటాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటారు. అరుపులు, కేకలు పోయి సంతోషంతో కూడిన నవ్వులు వినిపిస్తాయి. శాపాలు దూషణలుపోయి, శుభ సందేశాలు కృతజ్ఞతాభావాలు వెల్లివిరుస్తాయి. కుటుంబాలు ఏకత్వం అనుభవిస్తాయి. ఉద్యోగాలలో పనితనం పెరుగుతుంది. వ్యాపారాలలో లాభం అధికమగుతుంది. ఎందుకంటే ఆశీర్వాదము శాశ్వత జీవము అక్కడ ఉండాలని యెహోవా సెలవిచ్చియున్నాడు (కీర్తన 133:3).

శరీరాశ తీర్చుకోవడానికి లోక వ్యవస్థలో అనేక అవకాశాలు దొరుకుతాయి. శరీరం అలసిపోకూడదు, శ్రమకలగకూడదు, చేతులకు మురికికాకూడదు, విశ్రాంతి సుఖభోగాలు అమలు జరపాలి – ఇవే లోకవ్యవస్థలోని కొన్ని సూత్రాలు. ఇవి జరగడానికి నీతిని, యథార్థతను, క్రమమును, క్రమశిక్షణను, పరిశుద్ధతను విస్మరించమని లోక వ్యవస్థ బోధిస్తుంది, అనుకరిస్తుంది. గానీ దేవుని రాజ్య సంబంధులు దేవుని నీతి నెరవేర్చడానికి, యథార్థత కలిగి ఉండడానికి హింస సహిస్తారు, శ్రమను లెక్క చేయరు, అపవాదులకు భయపడరు. ఈ హింస రాజకీయ, సామాజిక, మతపరమైన కారణాలకు కాదు గాని కేవలము దేవుని నీతికొరకైన కారణాలకు సంబంధించినది. వారు తాము నమ్మిన దేవుని నీతి, సత్యాల కొరకు ఉద్యోగాలలో పదోన్నతులు వదులుకుంటారు. అన్యాయంగా వచ్చే లాభాలకు చెయ్యిచాచరు. ఉద్యోగంలో క్రమశిక్షణ మానరు. అబద్ధపు సర్టిఫికెట్లు, రసీదులు ఉపయోగించరు. ధనము అనే దేవతకు తలవంచరు. అవసరమైతే ప్రాణం ఇస్తారు. వారు దేవునివలన ఆశీర్వదించబడినవారు. వారి ఇంటి నిండా దేవుని నీతి ప్రతిమూలలోను కన్పిస్తుంది. వారి బ్యాంకులలో పెద్దమొత్తాలు లేకపోయినా చిమ్మెటలు, తుప్పు తినివేయలేని, దొంగలు కన్నము వేయలేని చోట విస్తారముగా పెట్టుబడులు పెడతారు. వారి ఫలము రోజురోజుకు అధికమగుట తలంచుకుని వారి హృదయం ఆనందంతో గంతులు వేస్తుంది (మత్త 5:12).

ఎప్పుడైనా ఈ ఆశీర్వాదాలను గూర్చిన ప్రస్తావన నీ ప్రార్థనలో వచ్చిన అనుభవం ఉందా? ఇవి ఆశీర్వాదాలనే గుర్తింపు ఉందా? ధన, ధాన్యాలు దేవుని కృపలు – అవి కొందరికి ఇవ్వబడతాయి, కొందరికి ఇవ్వబడవు. కాని దేవుని ఆశీర్వాదాలు షరతులతో కూడినవి. వాటిని ఆపేక్షించేవారు తమ్ముతాము పరిశుద్ధాత్మ దేవునికి అప్పగించుకొని ఆయన ద్వారా నడిపించ బడుచున్నప్పుడు మాత్రమే వారికి లభ్యమౌతాయి. పిల్లలు విదేశాల్లో సిర్థపడడం, గొప్ప ఉద్యోగాలు సంపాదించుకోవడం, పెద్ద ఇళ్ళు కట్టించుకోవడం, కారు, బ్యాంక్ అకౌంట్లు కలిగి ఉండడం ఆశీర్వాదాలుగా క్రొత్త నిబంధనలో ఎక్కడా చెప్పలేదు. దేవుడు ఆశీర్వాదం అనని వాటిని మనం ఎందుకు ఆశీర్వాదం అని చెప్పాలి? ఈ ధన్యతల్లో దాగి ఉన్న మౌళిక విలువలే మన దైనందిన జీవితాలకు దిక్సూచి కాగలదు.

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు

# UESI యుఇయస్ఐ మౌళిక విలువలు

'మన మూలాల్ని వెదుక్కొంటూ ఓ సారి వెనక్కెళ్ళి వద్దాం' అంటూ 1990 సం॥లో సర్ జాన్ మేజర్ బ్రిటన్ ప్రధాని కాగానే చెప్పిన మొదటి మాట. అప్పుడు ఆ దేశం ఎదుర్కొంటున్న కొన్ని క్లిష్టమైన పరిస్థితుల్ని అధిగమించడానికి ఆయన పాటించిన సూత్రం అది.

'రోజులు మారిపోయాయి, మూలాల్ని పట్టుకొని వేలాడితే పనికాదు, మన మూలాల్ని మర్చిపోదాం' అంటే కుదరదు. అది ఓ దేశాన్ని పాలించడమైనా, ఆటలైనా, చదువైనా, ఉద్యోగమైనా, ప్రభువు పరిచర్య అయినా – మన మూలాల్ని మర్చిపోవడమంటే, నేల విడిచి సాము చేయడమే. ముందుకు సాగడాన్ని పురోగమనం అంటాం. మనం పురోగమించాల్సింది మూల పాఠాల్ని మరిచి కాదు, విడిచి కాదు, వాటిని అనుసరిస్తూనే ఆ పునాదులమీదే పురోగతి సాధించాలి.

యుఇయస్ఐలో అనేక సంవత్సరాల నుండి మన పితరులు అందించిన దైవిక మౌళిక విలువలు కొన్ని ఉన్నాయి. వీటిని యుఇయస్ఐ కుటుంబంలోని అన్ని స్థాయిల వారు అంటిపెట్టుకొని ఉండాలి. అప్పుడే దేవుడిచ్చిన ఈ పరిచర్యను నాణ్యమైన రీతిలో కొనసాగించ గలుగుతాము. ఏ సభ్యుడైనా ఈ మౌళిక విలువలను వ్యక్తిగతంగా నెరవేర్చే విషయంలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే మన సంస్థకు బీటలు వారుతున్నట్లే. అలాగే యుఇయస్ఐ పట్ల దేవునికి ఉన్న ప్రణాళిక నీరుగారిపోతున్నట్లే. గనుక వీటిని జాగ్రత్తగా ఎల్లప్పుడూ మనస్సులో ఉంచుకొని శ్రద్ధతో పాటిద్దాం.

## మౌళిక విలువలు అంటే ఏంటి?

యుఇయస్ఐ సభ్యులు కలిగి ఉన్న/ఉండాల్సిన మానవ, దైవిక విలువలు. ఇవి ప్రాథమికమైనవి, ఎంతో ప్రాముఖ్యమైనవి. ఇవి యుఇయస్ఐ సభ్యుల జీవితాల్లో కొట్టొచ్చినట్లు కనబడతాయి.

2009 సంవత్సరంలో నేషనల్ యుఇయస్ఐ ఏజియంలో అప్పటి వరకు 17గా ఉన్న మౌళిక విలువలను తొమ్మిదిగా కూర్చారు.

### యుఇయస్ఐ మౌళిక విలువలు

1. దేవుని వాక్యం కేంద్రంగా ఉంటుంది
2. దేవునితో సంబంధం
3. సహవాసం
4. వ్యక్తిగత శ్రద్ధ
5. విద్యార్థి చొరవ
6. విశ్వాస జీవితం, ప్రార్థన
7. నైతిక పవిత్రత, ఆర్థిక విషయాల్లో యధార్థత
8. సమిష్టి నాయకత్వం
9. సమాజం పట్ల బాధ్యత

## మౌళిక విలువల ప్రాధాన్యత ఏంటి?

మత్తయి 7:24లో చెప్పినట్లు "యీ నా మాటలు విని వాటిచొప్పున చేయు ప్రతివాడును బండమీద తన యిల్లు కట్టుకొనిన బుద్ధిమంతుని పోలియుండును".

మౌళిక విలువలు మనము కలిగి ఉన్నామో లేదో వాన కురిసినప్పుడు, వరదలు వచ్చినప్పుడు, గాలి విసిరి కొట్టినప్పుడు తెలుస్తుంది. వివిధ రకాల పరిస్థితుల గుండా వెళ్ళినప్పుడు మౌళిక విలువలు కలిగిన వ్యక్తులు పడకుండా, కూలబడకుండా ఉంటారు.

ఈ మౌళిక విలువల విషయమై తగినంత శ్రద్ధ లేకపోతే వారు కాలుజారే చోట నిలబడినట్లే.

## మౌళిక విలువలు దిగజారి పోవడానికి కారణాలు ఏంటి?

❖ ప్రతి విశ్వాసి విలువలు కలిగి ఉండాలని, వాటిని దైనందిన జీవితంలో అనుసరించాలని

బైబిల్ బోధిస్తుంది. మనము లోకానికి వెలుగుగా, ఉప్పుగా ఉండాల్సిన స్థితిలో దీపాన్ని కుంచం క్రింద పెట్టడం, ఉప్పును నిస్సారంగా మార్చడం ద్వారా మన విలువలను మనమే దిగజార్చుకొంటాము.

- ❖ ఒక విశ్వాసిగా మౌళిక విలువలను పక్క వ్యక్తితో పోల్చుకోకుండా మనం పాటించాలి. అలా కానప్పుడు పక్కవారి జీవితం కొన్ని సార్లు మనల్ని ప్రభావితం చేస్తుంది. తద్వారా మనలో విలువలు దిగజారడం ప్రారంభమవుతుంది.
- ❖ తన దైనందిన జీవితంలో ప్రతి విశ్వాసి ఈ మౌళిక విలువలు తాను పాటించాలని గాక, ఎవరో వీటిని తప్పక పాటించాలని, వేరేవారెవరో వాటిని అనుసరించడం లేదని భావిస్తూ తాను కూడా దిగజారిపోతుంటాడు.
- ❖ ఒకసారి ఈ మౌళిక విలువల విషయంలో తప్పిపోతే, ఆత్మన్యూనత భావంతో మిగిలిన కాలమంతా దిగజారుతూనే ఉంటారు.
- ❖ మన ప్రక్కనున్న ప్రతి విశ్వాసి ఈ మౌళిక విలు వలను మనం ఆశించిన స్థాయిలో కలిగి ఉండాలని ఎదురుచూస్తూ, వారిలో కొన్ని లోపాలను తెలుసుకొని రోల్ మోడల్స్ లేరనే తప్పుడు భావనకు రావడం ద్వారా కూడా మన వ్యక్తిగత జీవితంలో విలు వలు తగ్గిపోవడానికి ఒక కారణంగా చెప్పొచ్చు.
- ❖ మన చుట్టూ ఉన్న ప్రపంచం, లోకమర్యాద, ఒత్తిళ్ళు, సాతాను తంత్రాలు, ఆర్థిక, సామాజిక పరిస్థితులు మనలో మౌళిక విలువలు దిగజారడానికి కొన్నిసార్లు దోహదపడతాయి.

## మౌళిక విలువలు దిగజారితే నష్టాలేంటి?

- ❖ పునాదులు పాడైపోతే ఒక భవనం ఎలా కుదుపులకు లోనవుతుందో అలాగే మౌళిక విలువలు దిగజారితే మనవలన మనకు, మన ప్రక్కవారికి నష్టం, మన చుట్టూ ఉన్న విశ్వాసులు, అవిశ్వాసులు, మన కుటుంబం నిరాశ, నిస్పృహలకు గురవుతారు.
- ❖ మనలను రోల్ మోడల్‌గా తీసుకోవడానికి ఎవరూ ఇష్టపడరు మరియు దేవుని నామానికి అవమానం తీసుకొస్తాము.

## మౌళిక విలువలను వ్యక్తిగత జీవితంలో, పరిచర్యలో ఎలా కలిగి ఉండాలి?

- ❖ యుఇయస్ఐ 9 మౌళిక విలువలను కంఠత పెట్టి, వాటిని అధ్యయనం చేయాలి.
- ❖ వీటిని మన దైనందిన జీవితంలో అనుసరించడానికి ప్రార్థనలో దేవుని సహాయాన్ని కోరుకోవాలి.
- ❖ మన దైనందిన జీవితంలో అది చిన్న నిర్ణయమైనా, పెద్ద నిర్ణయమైనా దేవుని వాక్యానికి మొదటి ప్రాధాన్యతనిచ్చి, మిగిలిన వాటికి/వారికి తర్వాత ప్రాధాన్యత ఇవ్వాలి.
- ❖ ప్రతిదినం వ్యక్తిగతంగా క్వైట్‌టైమ్ చేసుకొంటూ, మిగిలిన సమయంలో ప్రార్థనలో దేవుని సహాయాన్ని కోరాలి.
- ❖ మన వలె అమూల్య విశ్వాసం ద్వారా మారుమనసు పొందిన సహ విశ్వాసులతో సహవాసంలో పాల్గొనడానికి ఆసక్తిని కనబరచాలి.
- ❖ యంపిసి ద్వారా 1:3 డిసైపులింగ్ చేస్తూ వ్యక్తిగత శ్రద్ధ చూపడం ప్రారంభించాలి.
- ❖ గ్రాడ్యుయేట్స్, స్టాఫ్‌గా పరిచర్యలో పాల్గొంటూ, విద్యార్థి చొరవను ప్రోత్సహిస్తూ, మౌళిక విలువలు పాటించడంలో మాదిరిగా ఉండాలి.
- ❖ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ మీద ఆధారపడకుండా దేవుని మీద ఆధారపడేలా, విశ్వాసం, ప్రార్థనా జీవితం పెంపొందేటట్లు చూడాలి.
- ❖ ఎప్పటికప్పుడు జాగ్రత్తపడడం ద్వారా నైతిక, ఆర్థిక వ్యవహారాలలో పవిత్రంగా, యథార్థంగా జీవించాలి.
- ❖ 4 X 100 మీటర్స్ రన్నింగ్ రేస్ మాదిరిగా భావించి, సక్సెసర్ లేని సక్సెస్‌ను ఫెయిల్యూర్‌గా భావించి కనీసం ఆరు నెలల ముందుగానే మన సక్సెసర్‌ను ప్రార్థనా పూర్వకంగా నిర్ణయించి, సమిష్టి నాయకత్వాన్ని అందించాలి.
- ❖ మనకు పరిసరాల పరిరక్షణ, సమాజం పట్ల బాధ్యత ఉండాలి గనుక వ్యక్తిగతంగా, సామూహికంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, గవర్నమెంట్‌కి ట్యాక్స్ చెల్లిస్తూ, నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించమన్న దేవుని ఆజ్ఞను పాటించాలి.

– టి. థియోఫిలస్, వైజాగ్





# సేవక నాయకులను తర్ఫీదు చేయడం

"నాయకుడు ఒక వారధిలా, ఒక మెట్టులా ఉండాలి. దానిమీద తిమోతి లాంటి యువకులు ఎక్కి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలి. సేవక నాయకులను తర్ఫీదు చేసేవారు తమ జీవితాలను ఇతరుల కొరకు ఖర్చు చేసేవారిగా ఉండాలి"

ఒకసారి అడవిలో ఒక చీమ ఏనుగు చెవి మీద కూర్చొని ప్రయాణం చేస్తూ ఉంది. అవి వెళ్ళే దారిలో ఒక నీటివాగు ప్రవహిస్తూ ఉంది. అప్పుడు ఆ ఏనుగు దాని మీదున్న చెక్కవంతెన మీదుగా వాగును దాటుతున్నప్పుడు ఆ వంతెన షేక్ అవుతుంది. అప్పుడు ఆ చీమ ఏనుగు చెవిలో 'నీవు, నేను కలిసి ఈ వంతెనను షేక్ చేశాం' అని గుసగుసలాడుతుంది. మనం కూడా ఏనుగు చెవి మీద కూర్చొనే చీమలాంటివారమే. పని దేవునిది, పని జరిగించేది ఆయనే. మనము ఆయన చేతిలో పాత్రలం. ఈ గ్రహింపు మనకు ఎల్లప్పుడూ ఉండాలి.

దైవికమైన నాయకులను తర్ఫీదు చేసే విషయంలో రెండు విషయాలు ఇమిడి ఉన్నాయి. 1. ప్రజలతో పని చేయడం 2. ప్రజల కొరకు పని చేయడం. ప్రజలలో మన పట్ల నమ్మకం కలిగించాలి. నాయకుడు ఒక వారధిలా, ఒక మెట్టులా ఉండాలి. దానిమీద తిమోతి లాంటి యువకులు ఎక్కి ఉన్నత స్థానాన్ని చేరుకోవాలి. సేవక నాయకులను తర్ఫీదుచేసే వారు తమ జీవితాలను ఇతరుల కొరకు ఖర్చుచేసే వారిగా ఉండాలి.

దైవికమైన నాయకుని గురించి అనేక నిర్వచనాలు ఉన్నాయి. వాటిలో రాబర్ట్ క్లింటన్ ఇచ్చిన నిర్వచనం నాకు ఇష్టమైనది "దేవుడిచ్చిన శక్తి సామర్థ్యాలతో, దేవుడిచ్చిన బాధ్యతతో ఒక ప్రత్యేకమైన ప్రజను ప్రభావితం చేసి, వారి పట్ల దేవుని ఉద్దేశం నెరవేరేటట్లు చేసే వ్యక్తి దైవికమైన నాయకుడు". ఈ నిర్వచనం మొదటి భాగం ప్రకారం దైవికమైన నాయకుడు దేవుడు తనకిచ్చిన సామర్థ్యాన్ని, బాధ్యతను అభివృద్ధి చేసుకోవాలి. నాయకత్వం అంతటితో అంతం కాదు. ప్రాముఖ్యమైనది రెండవ భాగంలో ఉంది. అదేంటంటే "ఒక ప్రత్యేకమైన ప్రజను ప్రభావితం చేసి, వారి పట్ల దేవుని ఉద్దేశం తెలుసుకొని అది నెరవేరేటట్లు చేయడం". ఇది అత్యంత ప్రాముఖ్యమైనది. పరిచర్య అంటే రెండవ భాగంలో ఉన్న విషయమే. ప్రజలను నడిపించడం అంటే అందులో ఉన్న ఒక్కొక్క వ్యక్తి పట్ల శ్రద్ధ చూపించడం.

1970 లలో నేను అలహాబాద్ అగ్రికల్చర్ యూనివర్శిటీలో చదువుతున్నప్పుడు ఇయు ప్రెసిడెంట్‌గా ఉంటూ బైబిల్ స్టడీస్, ఇతర కార్యక్రమాలను మానేసేవాడిని. ఆ సమయంలో నేషనల్ స్టాఫ్ పిసి వర్గీస్ గారు నన్ను ఎంతో ఓపికగా భరించేవారు. "వేలంటైన్ పనికిమాలిన వాడు, అతన్ని బయటకు నెట్టేయండి" అనే మాటలు ఎన్నడూ అనలేదు. నా చేష్టలు, మాటలన్నీ భరించేవాడు. ఆయన నన్ను విడిచి పెట్టకుండా ఫాలోఅప్ చేశాడు కాబట్టే నేను ఈనాడు ఇలా ఉన్నాను. ఈ నా స్థితంతటికి కారణం పి.సి వర్గీస్‌గారే. యుఇయస్ఐ పరిచర్యలో ఉన్న ప్రతి ఒక్కరి జీవితంలో ఒక అన్న, అక్క, అంకుల్ ఎవరో ఉండే ఉంటారు. వారు చేసిన త్యాగం, వారి శ్రద్ధే మనల్ని నాయకులుగా నిలబెట్టింది. మనమందరం ఇలా ఉండకపోతే ఈ పరిచర్య కొనసాగదు. సేవక నాయకులను తర్ఫీదు చేయాలంటే ముందుగా మనం "ప్రభువా నేను చనిపోవడానికైనా సిద్ధంగా ఉన్నాను, నాకు పదవులు, పేరు ప్రఖ్యాతులు, అధికారం వద్దు.

ప్రజల కొరకు నా జీవితాన్ని పెట్టుబడిగా పెడతాను" అని ప్రభువుతో చెప్పాలి.

పరిచర్య అనగా ప్రస్తుతం ఉన్న దగ్గరనుంచి విద్యార్థులు ఎక్కడ ఉండాలని దేవుడు కోరు కుంటున్నాడో వారిని అక్కడికి నడిపించడం. కీర్తనలు 139:13-16లో చూసినట్లు దేవుడు ప్రతి వ్యక్తిని ప్రత్యేకమైన రీతిలో నిర్మించాడు. ఆ వ్యక్తికి సంబంధించిన ప్రతి విషయం ఆయనకు ముందే తెలుసు. ప్రతి వ్యక్తిలో అంతర్గతంగా శక్తి సామర్థ్యాలు ఇమిడి ఉన్నాయి. నాయకులను తర్ఫీదు చేసే వారు వ్యక్తులలో దాగివున్న శక్తి సామార్థ్యాలను గుర్తించి దానికి అనుగుణంగా నడిపించాలి. ఆ వ్యక్తి పట్ల దేవుని ఉద్దేశం తెలుసుకొని దానికి అనుగుణంగా తర్ఫీదును ఇవ్వాలి. చాలాసార్లు మనం ఇది చేయాలి, అది చేయాలి అంటూ అనేక కార్యక్రమాలు చేస్తుంటాం. కానీ వారిపట్ల ప్రభువుకు గల ప్రణాళిక నెరవేరేలా పనిచేయాలి. నీ అంతట నీవు పని చేసుకోవటానికి మార్గదర్శక సూత్రాలు చాలా ఉంటాయి గానీ దేవునితో అలాంటివి ఏమీ ఉండవు. "ప్రభువా నీవు ముందుకు వెళ్ళే దేవుడవు నేను నీతో పాటు కదులుతాను" అనేది మన ప్రార్థన కావాలి.

నేను ఒక వర్క్‌షాప్‌కు హాజరైనప్పుడు అక్కడ రిసోర్స్‌పర్సన్ ఒక కోడిగుడ్డు తీసుకొచ్చాడు. దాన్ని చూపించి దాని వెల ఎంత అని హాజరైన వారిని అడిగితే వారు రెండు, రెండున్నర, మూడు రూపాయలు అని చెప్పారు. దాన్ని పొదిగించి కోడిపిల్లను చేస్తే దాని ధర ఎంతవుతుంది అని అడిగాడు. నూట యాభైనుంచి రెండు వందలు దాకా ఉంటుందని చెప్పారు. అది పెరిగి గుడ్లు పెడితే దాని ధర ఎంత? ఇంకా ఎక్కువవుతుంది. ఆ గుడ్లను పొదిగించి ఇలా కొంతకాలం కొనసాగిస్తే దాని ధర ఎంత? అని అడిగితే అనంతం అని చెప్పారు. అప్పుడు ఆయన గుడ్డును నలిపేసి దీని ధర ఎంత అని అడిగాడు? ఏమీ లేదు అని చెప్పారు. దేవుడు ఒక్క గుడ్డుకు అనంతమైన విలువను ఇస్తే, ఆయన దృష్టిలో మన ఒక్కొక్కరి విలువ ఎంత?

ఏదో కమిటీగా కొన్ని కార్యక్రమాలు చేయడం ద్వారా నాయకులను తయారు చేయలేము. వ్యక్తిగతంగా ఫాలోఅప్ చేసినప్పుడు, ప్రతి ఒక్కరిలో శక్తి సామర్థ్యాలు దాగి ఉన్నాయని గుర్తించినప్పుడే వారిని సేవక నాయకులుగా తర్ఫీదు చేయగలం. రోమా 15:16లో పౌలు అన్య జనులకు పరిచారకుడను అని చెబుతున్నాడు. పౌలు అన్యజనులలోని హృదయ వేదన, చీకటి, చెదరిన జీవితం, వారు దేవునికి ఎంత దూరంగా ఉన్నారు, వారి దుష్టత్వం, మంత్రతంత్రాలు, అనైతికత అన్నీ చూశాడు. అన్యజనులు అనేది ఒక చిన్న మాట కాదు దాని వెనుక చాలా విషయాలు ఉన్నాయి. సేవక నాయకునిగా మనం వ్యక్తుల్ని తర్ఫీదు చేయాలంటే విద్యార్థుల అవసరాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి స్థితిగతులు పూర్తిగా అర్థం చేసుకోవాలి. విద్యార్థుల గురించి భారత ప్రభుత్వం ఏమైనా తెలుసుకోవాలంటే, యుఇయస్ఐ దగ్గరకి వచ్చేలా ఉండాలి. ఎందుకంటే యుఇయస్ఐకి వారి గురించిన సమస్యలు, సవాళ్ళు, అన్ని విషయాలు తెలుసు. యుఇయస్ఐ ఆ స్థాయిలో ఉందా? భారత ప్రభుత్వం మాకు విద్యార్థుల గురించిన గణంకాలు, సమస్యలు, పరిష్కారాలు చెప్పండి అని అడిగేలా యుఇయస్ఐ ఉండాలి. సేవక నాయకుల్ని తర్ఫీదు చేయడమంటే గ్రాడ్యుయేట్స్‌కు విద్యార్థుల పట్ల ఆవేదనను, తీవ్రమైన కోర్కెను కలిగించడం. తద్వారా వారికి నిద్ర లేకుండా చేయడం. భారతదేశంలోని విద్యార్థుల పట్ల దేవుడు శ్రద్ధ కలిగి ఉన్నాడు, వారి కోసం ఆయన హృదయం బ్రద్ధలవుతుంది.

విద్యార్థులకు సంబంధించి మీరు చాలా గణాంకాలు కమిటీలలో చూపిస్తున్నారు. అయితే వారి అవసరాలకు సంబంధించిన గణాంకాలు ఏవి? మాదక ద్రవ్యాలకు బానిసలైనవారు ఎంతమంది ఉన్నారు? ఎంతమంది త్రాగుబోతులు ఉన్నారు? ఎంతమంది కళాశాలలను అర్థాంతరంగా మానేసిన వారు ఉన్నారు? ఎంత దుర్నీతి ఉంది? ఎటువంటి పెద్ద సమస్యలు వారిని సంతోషంగా లేకుండా చేస్తున్నాయి? వీటన్నింటిని యుఇయస్ఐ ఏవిధంగా చూస్తుంది?

పౌలు అన్యజనుల మధ్య పనిచేసేటప్పుడు ఆయనకు వారి గురించి తెలుసు. ప్రతి క్షణం పౌలు అన్యజనుల గురించి, వారి బాధను గురించి తీవ్రంగా ఆలోచించేవాడు. భారతదేశంలోని విద్యార్థుల గురించి ఆ విధమైన బాధ నీకు ఉందా? ఒక వేళ నీకు ఆ బాధ లేకపోతే దేవునికి ప్రార్థించు. దేవా నాకు విద్యార్థులను గురించిన భారం లేదు. నేను ప్రోగ్రామ్స్‌లో భాగస్తుడిగా ఉంటున్నాను. విద్యార్థుల పట్ల భారం లేకుండా కేవలం కార్యక్రమాల్లో పాలిభాగస్తునిగా ఉండడం నేరం. విద్యార్థుల మధ్య గొప్ప పరిచర్య చేస్తున్నామని చెప్పే

యుఇయస్ఐ ఈ దువరస్థ నుంచి విద్యార్థులను రక్షించకపోతే మరెవరు రక్షిస్తారు? నీలో ఈ భారం లేకపోతే ఈ భారం కలిగేలా ఇతర నాయకుల్ని ఎలా తయారు చేస్తావు? నేడు భారాన్ని ఇతరులకు బదిలీ చేయకుండా కార్యక్రమాల్ని బదిలీ చేస్తున్నారు. పౌలు అన్యజనులను ఒక సేవగా కాకుండా దేవుని దృక్కోణంతో, పరిశుద్ధాత్మ ద్వారా పరిశుద్ధ పరచబడి దేవునికి అంగీకారయోగ్యమైన అర్పణగా చూస్తున్నాడు. పౌలు అన్యజనులను ప్రస్తుతం వారున్న స్థితి నుంచి దేవుడు కోరుకున్న స్థితికి నడిపించడమే నా సేవ అని చెప్పాడు. ఆయన శరీరంలోని ప్రతి అణువు, అనుక్షణం దీనిగురించే తపిస్తూ ఉంది. దానికోసం ఆయన ఓడ ధ్వంసానికి, దెబ్బలకు, చెరసాలకు మొదలైన వాటికి సిద్ధపడ్డాడు. ప్రస్తుతం విద్యార్థులు న్న పరిస్థితి నిన్ను కలవరపరుస్తుందా? నీకు నిద్రను దూర పరుస్తుందా? వారి పట్ల దేవుని ప్రణాళికలు ఏంటి? దేవుడు కోరుకున్న స్థితికి వారిని ఎలా తీసుకెళ్ళాలి? అని ఆలోచిస్తున్నావా? ఆ భారం మనకు కావాలి, ఆ ఉద్యమంలో మనం కూడా పాలిభాగస్తులం కావాలి. అదే నిజమైన సేవ.

తీర్పు కోసం పౌలును అగ్రిప్ప రాజు సముఖానికి తీసుకొని వచ్చినప్పుడు అగ్రిప్ప పౌలును చూసి తన పక్షమున చెప్పుకోవడానికి అవకాశం ఇచ్చినప్పుడు పౌలు తన గురించి, తన దర్శనాన్ని గురించి వివరించి (అపొ.కా 26:19) ఆకాశము నుంచి కలిగిన ఆ దర్శనానికి అవిధేయుణ్ణి కాలేనని తన జీవిత చరమాంకంలో సాక్ష్యమిస్తాడు. మనం కూడా దేవుడు మనకిచ్చిన దర్శనాన్ని మరచి పోకూడదు. నీ చివరి దశలో ఇతరులు నీ గురించి ఏమని సాక్ష్యమివ్వాలని అనుకుంటున్నావు?

గలతీ 2:20లో పౌలు "నేను క్రీస్తుతో కూడా సిలువ వేయబడియున్నాను'' అనేది గతంలో జరిగిపోయింది కాదు గానీ అనుదినం మనలో జరగాల్సిన కార్యము. అంటే సింహాసనము మీద నుంచి మనం దిగి యేసుక్రీస్తును కూర్చో బెట్టడం. "ఇకను జీవించువాడను నేను కాను క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" అనేది క్రీస్తు కేంద్రిత జీవితాన్ని సూచిస్తుంది. నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితం "మన దైనందిన జీవితానికి సంబంధించినది". నన్ను ప్రేమించి నా కొరకు తన్ను తాను అప్పగి ంచుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసము వలన జీవించుచున్నాను - అంటే ప్రతి దానికి దేవుని మీద ఆధారపడుతూ ఆయన యందు విశ్వాసముంచడం.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చే నాటికి 1200 మిషన్ హాస్పటల్స్ ఉండేవి. ప్రస్తుతం 130 మాత్రమే ఉన్నాయి. వాటిలో ప్రస్తుతం చక్కగా పనిచేస్తుంది కేవలం 30 మాత్రమే. దానికి రెండు కారణాలు ఉన్నాయి. 1. నిర్వహణాలోపం, నిధుల దుర్వినియోగం. 2. అహం వల్ల వ్యక్తుల మధ్య సరైన సంబంధాలు లేకపోవడం.

2 కొరింథీ 4:10,11లలో యేసుక్రీస్తు యొక్క జీవము మన శరీరంలో ప్రత్యక్షమవునట్లు మనం ఎల్లప్పుడు యేసు నిమిత్తం మరణానికి అప్పగిం చుకోవాలి. అంటే మన అహాన్ని చంపుకోవాలి. ఒక వ్యక్తిలో అహం (ఇగో) ఉన్నదని ఈ లక్షణాలను బట్టి గుర్తించవచ్చు.

ఒకరితో పోల్చుకోవడం/పోటీతత్వంతో ఆలోచించడం, ఇతరుల ఆమోదం కోసం ఎదురు చూడటం, నేను గెలవాలి ఎదుటివారు ఓడిపోవాలి, సరిగా వినకపోవడం, సమర్థించుకోవడం, ఫిర్యాదు చేయడం, మొండిగా వ్యవహరించడం, దర్శనం లేకపోవడం, అభద్రతాభావం, తన గురించి తాను చెప్పుకోవడం, ఇతరుల పాపాలు, తప్పులను ఎత్తిచూపడం, అధికారానికి లోబడకపోవడం, బాధించే మనస్తత్వం, తోటివారితో కలసి పనిచేయ లేకపోవడం, వేరే వారి పనులకు నా ఉద్దేశాలను ఆపాదించడం, విమర్శనాత్మక ధోరణి, నేను పనిచేయకపోవడానికి ఇతరులు కారణం అని నిందించడం, తప్పును అంగీకరించకపోవడం, ఎప్పుడూ చింతించడం.. మొదలగునవి.

ఇవి మనలో ఏమి ఉన్నాయో స్వయం పరిశీలన చేసుకొని తీసివేసుకున్నప్పుడే క్రీస్తు కేంద్రిత జీవి తాన్ని కలిగివుంటాము. ఇతరులతో సంబంధాలను బలపరచుకుంటాము. అహాన్ని క్రీస్తు సిలువ చెంతకు తీసుకొని రావాలి. ఇతరుల పట్ల నిజమైన బాధ్యత, భారం కలిగినవారు అహాన్ని చంపివేయాలి.

సేవక నాయకులను తర్ఫీదు చేయాలంటే వారి కొరకు మన ప్రాణాన్ని పెట్టేవారంగా ఉండాలి. ఇది కేవలం క్రీస్తు కేంద్రిత జీవితాన్ని కలిగిన వారికి మాత్రమే సాధ్యమౌతుంది (1 థెస్స 2:4-6,8).

**- వేలంటైన్ దేవిదార్,** చెన్నై

# సిద్ధంగా ఉండు

*సంఘాల్లో ఇయు పరచర్యను తక్కువ సమయంలో పరిచయం చేయడానికి...*



భారతదేశ జనాభా సుమారు 145 కోట్లు. దీనిలో 25 సంవత్సరాల లోపు ఉన్న యువత 50% కంటే ఎక్కువగా ఉన్నారు. వీరిలో కాలేజీల్లో, యూనివర్శిటీల్లో చదువుతున్న విద్యార్థులు 2.856 కోట్లు. విద్యార్థుల మధ్య పని చేస్తున్న ఉద్యమాలు నేడు భారతదేశంలో అనేకం ఉన్నాయి. ఉదా. యస్‌యఫ్‌ఐ, ఏబివిపి.... అయితే విద్యార్థి గురించి అన్ని విషయాలు (శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, సామాజిక...) ఆలోచించే ఉద్యమాలు/ సంస్థలు చాలా తక్కువనే చెప్పుకోవాలి.

యుఇయస్‌ఐ (యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా) విద్యార్థులను అన్ని విషయాల్లో పట్టించుకొంటూ, వారిని చక్కగా గైడ్ చేస్తూ ఉంది. నేటి విద్యార్థిలోకం స్నేహితుల ఒత్తిడితో, సోషల్ మీడియాతో కొట్టుకొని పోతూ, కెరీర్‌కు సంబంధించిన సమస్యలు ఎదుర్కొంటూ, న్యూనతాభావంతో సతమతమవుతూ తల్లిదండ్రులకు నెమ్మది లేకుండా చేస్తూ జీవితాల్ని పాడుచేసుకొంటూ ఉన్నారు. ఇలాంటి విద్యార్థులను దేవునివైపుకు తిరిగేలా ప్రోత్సహించి వారు మంచి వ్యక్తులుగా మారి, తల్లిదండ్రులు, సమాజం గర్వపడే విధంగా ఉండాలనే ఆశతో ఆ దేవాది దేవుడు చెన్నైలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఇనాక్ మరియు కొందరిని ప్రేరేపించి యుఇయస్‌ఐ (యూనియన్ ఆఫ్ ఇవాంజిలికల్ స్టూడెంట్స్ ఆఫ్ ఇండియా) అనే ఉద్యమాన్ని 1954 సెప్టెంబర్ 18న భారతదేశంలో లేవనెత్తారు.

యుఇయస్‌ఐ పితరులకు దేవుడిచ్చిన దర్శనం "మార్పు చెందిన విద్యార్థులు ప్రభువైన యేసుక్రీస్తు శిష్యులుగా కళాశాల ప్రాంగణాలను, దేశాన్ని ప్రభావితం చేయడం". అందువల్ల వారు "ప్రతి విద్యార్థి యేసు ప్రభువును ఎరిగి, ఆయనను నమ్ముకొని తల్లిదండ్రులకు, సమాజానికి, సంఘానికి ఉపయోగపడే విద్యార్థులుగా ఉండాలనే దర్శనంతో పని చేయడం మొదలుపెట్టారు. చిన్నగా ఆరంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు అనేక ప్రదేశాలకు విస్తరించి, సుమారు దేశంలో 2000 ప్రాంతాల్లో, మన రాష్ట్రంలో 200 పట్టణాల్లో పని చేస్తూ ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థుల్లో మార్పు తీసుకొస్తుంది.

## యుఇయస్ విద్యార్థులకు ఏమి చేస్తుంది?

- కాలేజీల్లో, యూనివర్శిటీల్లో చదివే విద్యార్థులకు బైబిల్ స్టడీస్, క్యాంప్స్ నిర్వహించి వారు యేసుక్రీస్తే నిజమైన దేవుడని, ఆయన అన్ని సమస్యలకు పరిష్కారం చూపగలడని తెలియజేసి వారు ఆయన్ను నమ్ముకొని వారి జీవితాలను ఆనందమయం చేసుకొనేలా ప్రోత్సహిస్తుంది.
- ఈ కాంపిటేటివ్ ప్రపంచంలో విద్యార్థి విద్యలో ఎలా రాణించాలో, ఎలా జాబ్ సంపాదించాలో గైడ్ చేస్తుంది (కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్‌స్కిల్స్... పై అవగాహన కల్పిస్తుంది).
- ప్రీ మేరిటల్ కౌన్సిలింగ్, కుటుంబానికి సంబంధించిన అనేక విషయాల గురించి ట్రైనింగ్ ఇస్తుంది. కుటుంబం క్రీస్తు కేంద్రిత కుటుంబంగా ఉంటూ సంతోషంగా ఉండేలా ప్రోత్సహిస్తుంది.

## UESI ప్రత్యేకతలు:

- ఇది బైబిల్‌లోని 66 పుస్తకాలను దేవుని వాక్యమని నమ్ముతుంది, బోధిస్తుంది.
- ఇది ఒక శాఖ నుండి (డినామినేషన్) చీలి వచ్చింది కాదు. దీనిలో కులం, మతం, ప్రాంతం, శాఖ అనే అంశాలకు తావే లేదు.
- ఇది చర్చ్‌కి ప్రత్యామ్నాయం అస్సలు కాదు, ఇది కొత్త సంఘాన్ని స్థాపిస్తుందేమో అని భయపడాల్సిన పనే లేదు. ఎందుకంటే ఉన్న సంఘాలకు సహాయం చేస్తుందేకాని క్రొత్త సంఘాలను స్థాపించదు. ఇందులోని సభ్యులు ప్రతి ఆదివారం ఎవరి సంఘాలకు వారు వెళతారు. క్రొత్తగా రక్షించబడిన వారిని సువార్తను నమ్మి, బోధించే సంఘాలకు వెళ్ళమని ప్రోత్సహిస్తారు.

- ఆర్థిక అవసరాల కొరకు ఎవరిని యాచించదు. ఇందులో ఉన్న సభ్యుల సహకారంతో ముందుకు సాగుతుంది. అవసరాల కొరకు దేవుని సహాయం కోరుతుందే కానీ, విదేశీయుల సహాయం కోరదు.

## దీనిలో సభ్యులు ఎవరెవరు ఉంటారు? సభ్యత్వ రుసుము ఎంత?

**సభ్యులు:** మూడు రకాలు

1. **స్టూడెంట్స్:** యేసు ప్రభువును తమ రక్షకునిగా ప్రభువుగా అంగీకరించి ఈ పరిచర్యలో పాల్గొనే కాలేజ్ మరియు యూనివర్సిటీ విద్యార్థులు.
2. **గ్రాడ్యుయేట్స్:** యేసుక్రీస్తును తమ రక్షకునిగా, ప్రభువుగా అంగీకరించి చదువు ముగించుకొని ఉద్యోగాలు చేస్తూ విద్యార్థుల పరిచర్యలో పాల్గొనాలని ఆశ కలిగిన వారు.
3. **స్టాఫ్ వర్కర్స్:** రక్షించబడి దేవుని పిలుపు మేరకు విద్యార్థుల మధ్య పూర్తికాల సేవ చేయడానికి ఇష్ట పడి దేవుని పని చేసేవారు.

**సభ్యత్వ రుసుము:** ఇక్కడ ఎటువంటి రుసుము వసూలు చేయబడదు. ఇదే ఈ పరిచర్య యొక్క మరొక ప్రత్యేకత.

## యుఇయస్ఐ సంఘానికి ఏమి చేస్తుంది?

యుఇయస్ఐ క్రైస్తవ సంఘాలకు ప్రత్యామ్నాయం కాదు, కానీ సంఘ అభివృద్ధికి అన్ని విధాల సహాయపడుతుంది. బైబిల్‌ని పరిపూర్ణ దేవుని వాక్యంగా నమ్ముతూ, క్రీస్తును దేవునిగా అంగీకరించే ఏ సంఘంతోనైనా ఇయు కలిసి పనిచేస్తుంది. దేశంలోని ఆయా డినామినేషన్స్‌కు చెందిన అనేకమంది క్రైస్తవ విశ్వాసులు ఈ పరిచర్యలో భాగస్వాములుగా ఉండటమే ఇందుకు నిదర్శనం. తమ తమ సంఘ సేవా కార్యక్రమాల్లో బాధ్యతా యుతంగాను, చురుకుగాను పాల్గొనమని సభ్యులను ప్రోత్సహిస్తుంది.

## యుఇయస్ఐ మీ నుంచి ఏమి ఆశిస్తుంది?

భారతదేశంలో ఉన్న ప్రతి విద్యార్థి యేసు ప్రభువును నమ్ముకొనే విధంగా యుఇయస్ఐ పనిచేయాలని ప్రార్థించండి. అలాగే కాలేజీల్లో, యూనివర్శిటీల్లో చదివే మీ పిల్లలను దగ్గర్లో జరుగుచున్న బైబిల్ స్టడీస్‌కు క్యాంప్స్‌కు పంపించి వారి జీవితాలను అనేక మందికి ఆశీర్వాదకరంగా ఉండేటట్లు చేయాలని యుఇయస్ఐ ఆశిస్తుంది.

## ఇయు సండే నిర్వాహకులకు గమనిక:

- యుఇయస్ఐ గురించి ఉపోద్ఘాతం ఇయు సండేల్లో 15 నిమిషాలకు మించి ఉండకుండా చూడండి. లోకల్ గ్రాడ్యుయేట్ మంచి అవగాహన కలిగే విధంగా జాతీయ, రాష్ట్ర, స్థానిక స్థాయిల్లో జరిగే పరిచర్య గురించి వివరిస్తూ, సంఘానికి, సమాజానికి సేవ చేస్తూ ప్రభావితం చేస్తున్న వారిని పరిచయం చేయాలి.
- స్పీకర్ తన వ్యక్తిగత అనుభవాన్ని 2 లేక 3 నిమిషాల్లో తెలియజేయవచ్చు. ఇయు పరిచర్య ద్వారా క్రీస్తును ఎలా అంగీకరించావో, ఆయా రంగాలలో ఇయు ఎలా సహాయం చేసిందో తెలియజేయవచ్చు.
- ఇయు సండేల్లో మాట్లాడేటప్పుడు సమయం తప్పక పాటించండి. అలాంటి వారినే స్పీకర్స్‌గా పిలవండి.
- ఇయు సండే నిర్వహించేటప్పుడు ఆ ఇయు/ ఇజియఫ్‌లో ఉన్న విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ తప్పక వచ్చేటట్లు ప్లాన్ చేసుకోండి.
- ఇయు సండేలో ఇంట్రడక్షన్ ఇచ్చిన తర్వాత స్పీకర్ ఒక్కసారి అందరిని (విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్) గ్రూప్‌గా నిలబెట్టి పరిచయం చేయటం మంచిది.
- వాక్య సందేశం అయిపోయేలోపు సంఘ సభ్యులు వాక్యానికి ఆకర్షితులై మా పిల్లలను యుఇయస్ఐ పరిచర్యకు పంపించవచ్చు అనే అభిప్రాయంలోకి వచ్చే విధంగా వాక్య సందేశం ఉండేటట్లు జాగ్రత్తపడండి.
- యుఇయస్ఐ ఉపోద్ఘాతంలో మన లక్ష్యాలు, సిద్ధాంతాలు గురించి... వివరణ ఇవ్వవలసిన పనిలేదు. ఎందుకంటే సమయం సరిపోదు, వాళ్ళకు ప్రస్తుతానికి అవి అవసరంలేదు.
- ఇయు గురించిన కరపత్రికలు, విద్యార్థిజ్వాల కాపీలు కొన్ని మీతో తీసుకెళ్ళండి.
- ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు పాస్టర్‌గారి కి, సంఘపెద్దలకు, సభ్యులకు వందనాలు తెలియజేయండి.

**– పి. ప్రేమ్ కుమార్,** స్టాఫ్ వైజాగ్

ప్రత్యేకం

# శరీర సంబంధి ఆత్మసంబంధి

ప్రపంచంలోని వ్యక్తులను మనం మూడు రకాలుగా విభజించవచ్చు. ప్రకృతి సంబంధులు, శరీర సంబంధులు, ఆత్మ సంబంధులు. రక్షణ పొందని వారిని ప్రకృతి సంబంధులు అని అంటాము. శరీర సంబంధి, ఆత్మ సంబంధి ఇద్దరూ విశ్వాసులే. వీరిలో శరీర సంబంధులు యేసును అంగీకరించి కొద్దికాలం కొనసాగి దేవున్ని తన జీవితానికి ప్రభువుగా అంగీకరించకుండా తమను తామే ఏలుబడి చేసుకొంటారు. ఆత్మసంబంధులు ఆత్మానుసారముగా ప్రవర్తిస్తూ, ఆత్మ విషయముల మీద మనస్సుంచుతారు. శరీర సంబంధికి ఆత్మ సంబంధికి ఉన్న తేడా అంతా ఆత్మీయ జీవితం యొక్క అభివృద్ధిలోనే ఉంటుంది.

### 1. ప్రకృతి సంబంధులు

ప్రకృతి సంబంధి అవిశ్వాసి. క్రీస్తును కలిగి ఉండడు. పాప పురుషునితో నింపబడి ఉంటాడు. స్వచిత్తం హృదయంలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించి ఉంటుంది. గలతీ 5:19-20 ప్రకారం శరీర క్రియలతో నింపబడి ఉంటాడు.

1. దేవుని ఆత్మ విషయాలను అంగీకరించడు (1 కొరింథీ 2:14)
2. అవి అతనికి వెర్రితనముగా ఉంటాయి (1 కొరింథీ 2:14)
3. అతడు ఆత్మవిషయాలను గ్రహింపజాలడు (యూదా 1:19)
4. పరిశుద్ధాత్మ తమలో లేనివారు
5. వారు బేధాలు కలుగజేస్తారు (యూదా 1:19)
6. ప్రకృతి సంబంధమైన జ్ఞానము పరలోక జ్ఞానము వంటిది కాదు (యాకోబు 3:15)
7. అది దయ్యముల జ్ఞానము వంటిది (యాకోబు 3:15)



ప్రకృతి సంబంధి ఆత్మ విషయాలను గ్రహించడు కాబట్టి వాటిని అంగీకరించలేడు. తనకున్న ప్రకృతి జ్ఞానాన్ని అనుసరించి ప్రవర్తిస్తాడు, నిర్ణయాలు తీసుకొంటాడు. కొరింథీ సంఘంలో గ్రూపులు ఏర్పడ్డాయి. ఒకడు నేను పౌలు వాడను, మరొకడు నేను అపొల్లోవాడను, మరొకడు నేను కేఫా వాడను అని చెప్పుకొంటున్నారంటే అభిమాన సంఘాలు ఏర్పడినట్లే. అభిమాన సంఘాల మధ్య పోటీ, కలహాలు ఉంటాయి. మనమంతా క్రీస్తుకు చెందిన వారము. ఒకే కుటుంబంలోని వారము. మనకు ఎన్ని అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికి ఐక్యత ఉండాలి. మనము వ్యక్తుల ఆధారంగా, గ్రూపులుగా విడిపోతే మనము ప్రకృతి సంబంధులమే.

యాకోబు రాసిన పత్రికలో ప్రకృతి సంబంధి అయినవాడు సాత్వికత లేక, అయోగ్యమైన ప్రవర్తన కలిగి, మత్సరము, వివాదము ఉంచుకొని అబద్ధమాడేవాడుగా ఉంటాడు అని రాయబడింది (యాకోబు 3:13-14).

యూదా రాసిన పత్రికలో అబద్ధ బోధకులను ప్రకృతి సంబంధమైన మనుష్యులతో పోలుస్తాడు. వారు గ్రహింపరాని విషయాలను గూర్చి ద్వేషిస్తూ వివేకములేని వారుగా ఉంటారని రాయబడింది. అంతేకాకుండా వారు పరిశుద్ధాత్మ లేనివారై బేధాలు కలుగజేస్తారని రాయబడింది.

## 2. శరీర సంబంధులు

శరీర సంబంధులు యేసును అంగీకరించి కొద్దికాలం మంచిగా దేవునిలో కొనసాగి రానురాను దేవున్ని ప్రభువుగా అంగీకరించకుండా తమను తామే ఏలుబడి చేసుకునేవారు. వీరిలో పరిశుద్ధాత్ముడు నివసిస్తాడు గానీ, వారు పరిశుద్ధాత్ముని యొక్క సంపూర్ణ అధికారం కిందకు రారు. క్రీస్తు స్థానంలో స్వచిత్తం వచ్చి అదే వారి జీవితాన్ని పాలిస్తూ ఉంటుంది. వీరి జీవితాల్లో సాక్షిక విధేయత, వేషధారణ కనిపిస్తాయి. ఈ క్రింది లక్షణాలను బట్టి శరీర సంబంధులు ఎవరో గుర్తించవచ్చు.

1. శరీరానుసారులు దేవుని విషయాల మీద కాక శరీర విషయాల మీద మనస్సును ఉంచుతారు.
2. శరీరానుసారమైన మనస్సు దేవుని ధర్మశాస్త్రానికి ఎంతమాత్రము లోబడదు.
3. శరీర స్వభావము గలవారు దేవుని సంతోష పరచలేరు.
4. శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధము.
5. శరరానుసారమైన మనస్సు మరణము.
6. శరీర సంబంధులు బలహీనులుగా, ఆత్మీయంగా ఓడిపోయిన, రాజీపడిన స్థితిలో ఉంటారు.
7. శరీర కార్యాలు జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరము, క్రోధములు, కక్షలు, బేధములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు. ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరు అని పౌలు చెప్పారు.




పై లక్షణాలను గమనించినప్పుడు వీరి స్వభావం, ప్రవర్తన ప్రకృతి సంబంధులకు సమీపంగా ఉన్నట్లే కనిపిస్తుంది. శరీరకార్యాలు అన్నీ వీరి జాబితాలో లేకపోయినప్పటికి కొన్నింటిని చేస్తూ తమలో ఉన్న పరిశుద్ధాత్మను దుఃఖపరుస్తూ ఉండే అవకాశం ఉంది.


## 3. ఆత్మసంబంధులు

వీరు పరిశుద్ధాత్మను కలిగి, ఆత్మానుసారముగా ప్రవర్తిస్తారు, ఆత్మ విషయాల మీద మనస్సు ఉంచుతారు. దేవుని ఆత్మ విషయాలను అంగీకరిస్తారు. ఆత్మానుభవముచేత వివేచిస్తారు. వాటిని గ్రహిస్తారు.

1. ఆత్మచేత నడిపించబడతారు.
2. ఒకరికొకరు వివాదము రేపక ఉంటారు. ఒకరిపట్ల, మరొకరు అసూయపడకుండా ఉంటారు.
3. వృథాగా అతిశయపడకుండా ఉంటారు.
4. క్రమముగా, ప్రేమగా నడుచుకొంటారు.
5. ఇంద్రియ నిగ్రహము గలవారుగా, ఆత్మ స్వభావము కలిగి ఉంటారు.
6. ఆత్మచేత నియంత్రించబడతారు.
7. ఆత్మఫలాన్ని ఫలిస్తారు (గలతీ 5:22)

మనము ఆత్మ సంబంధులముగా ఉండాలంటే మన ప్రాచీన స్వభావము సిలువ వేయబడిందని ఎరగాలి. పరిశుద్ధాత్మ చేత శరీర క్రియలు చంపాలి. నూతన స్వభావము (నవీన స్వభావము) అనుదినము బలపరచబడుతూ ఉండాలి. మనము ఆత్మ సంబంధులుగా చెప్పుకొంటూ శరీర స్వభావంతో ప్రవర్తిస్తే సహవాసాల్లో సమస్యలు ఏర్పడతాయి. ఒక చర్య, ప్రతిచర్య, ఒక వైఖరి, ఒక విలువ ఆత్మ సంబంధమైనదా, శరీర సంబంధమైనదా అని ఒక ఆత్మ సంబంధి సులువుగా గ్రహిస్తాడు.

మనము ఆయన వాక్యములో నిలిచి ఉంటే బహుగా ఫలిస్తామని మనకు తెలుసు. ఆత్మఫలము, ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము. ఆత్మఫలములో ఉండే 9 లక్షణాలలో 4 వ్యక్తిగతమైనవి, 5 సంబంధాలకు సంబంధించినవి.




ఉదాహరణకు ప్రేమ, దయాళుత్వము, సమాధానము, మంచితనము, సాత్వికము మొదలైనవి సంబంధాలలో వెల్లడి అయ్యే లక్షణాలు.

గలతీ 5:16లో ఆత్మానుసారముగా నడుచుకొనుడి. అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరని రాయబడింది. శరీరము ఆత్మకు, ఆత్మ శరీరమునకు విరోధముగా అపేక్షిస్తుంది. అవి ఒకదానికి మరొకటి వ్యతిరేకంగా ఉంటాయి అని రాయబడింది. క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని ఇచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేసియున్నారు అని రాయబడింది (గలతీ 5:24).

మనము తిరిగి జన్మించిన తర్వాత మన హృదయాలలో పరిశుద్ధాత్మని పని, మనలను దేవుని పోలికలోనికి అనుదినము మార్చుతూ ఆయన స్వరూపములోనికి మార్చడమే. ఆత్మసంబంధి పరిశుద్ధాత్మచేత నింపబడి ఆత్మ దేవుని ఆధీనంలో ఉంటూ నడిపించబడతాడు. శరీరసంబంధి శరీర సంబంధమైన కోర్కెలు, ఆశల ద్వారా నడిపించబడతాడు. శరీరేచ్ఛలు వారి జీవితంలో ప్రముఖ పాత్ర వహించి, అధికారం చూపిస్తాయి.

శరీరానుసారులు దేవుని సంతోషపరచలేరు. శరీరానుసారమైన మనస్సు దేవునికి విరోధం. అది దేవునికి లోబడదు గనుక వీరేమి చేయాలనుకొంటున్నారో అది చేయలేరు అని రాయబడింది.

పౌలు రోమా పత్రిక 7వ అధ్యాయంలో మేలు చేయవలెనని కోరిక నాకు కలుగుచున్నది గాని దానిని చేయడం నాకు సాధ్యపడడం లేదు అని వాపోతూ దానికి గల కారణం చెప్పాడు. అది నాలో నివసించు పాపమే అని రాస్తూ, అది నేను కాదు అంటాడు. నాలో ఉన్న పాప నియమం నన్ను చెరపట్టి లోబరచుకొంటూ నా మనస్సులో ఉన్న ధర్మశాస్త్రముతో పోరాడుతుంది అని చెబుతాడు. అయితే దీనికి పరిష్కారం క్రీస్తుయేసునందు జీవమునిచ్చు ఆత్మ యొక్క నియమం పాపమరణ నియమములనుండి నన్ను విడిపించెను అని రాస్తాడు. ఈ విషయాన్ని గుర్తుపెట్టుకొంటూ మనము నూతన స్వభావాన్ని పోషిస్తూ ఆత్మ సంబంధులుగా ఉందాము.

శరీర సంబంధులుగా నడిచేవారు రోమా 6; 11, 8:13, 12:1-2లో చెప్పినట్లు మనం మన పాపముల విషయమై పశ్చాత్తాపపడుతూ ఆయన వలన క్షమాపణ పొందినప్పుడు ఆత్మానుసారమైన జీవితం వృద్ధి పొందుతూ శరీరానుసార జీవితం తగ్గించబడుతుంది. దీనిని పవిత్రీకరణం అంటారు. కావున మనం మన పాపముల విషయమై దిన దినం చనిపోతూ, ఆత్మీయంగా జీవిస్తూ ఆయన స్వారూప్యం లోకి మారునట్లు ప్రభువు కృప మనందరికి తోడై ఉండును గాక !

**– జి. జెర్మియా ప్రసాద్,**
ఏపి-ఇజియఫ్ స్టాఫ్, నంద్యాల

# ధన్యతలు

బైబిల్ స్టడీ

**(మత్తయి 5:1-11)**

బైబిల్ అంతటిలో యేసుక్రీస్తు ప్రభువు చేసిన కొండమీద ప్రసంగం (మత్తయి 5:1-7:28) ఒక ప్రత్యేకతను సంతరించుకొంది. ఈ ప్రసంగం వినడానికి గలిలయ, దెకపొలి, యెరూషలేము, యూదయ, యొర్దాను అవతలి ప్రదేశ ప్రాంతాల నుండి ప్రజలు వచ్చారు (మత్తయి 4:25). ఈ ప్రసంగం ప్రారంభంలో 'ధన్యులు' అనే మాట తొమ్మిది సార్లు కనిపిస్తుంది.

ధన్యత 'బీయాటిట్యూడ్' అనే పదానికి గ్రీకు పదం 'మాకరియోస్'. అంటే ఆశీర్వాదం, సంతోషం, వర్ధిల్లడం. లాటిన్ పదం 'బీయాటిట్యుడో' అంటే సంతోషం, ఆశీర్వాదం.

మార్టిన్ లాయిడ్ జోన్ ఈ ధన్యతలకు సంబంధించి నాలుగు ముఖ్యమైన సత్యాలను చెప్పాడు. 1. ప్రతి క్రైస్తవ విశ్వాసి ఎలా జీవించాలో తెలియజేయడానికి ఇవి వర్ణనలా ఉన్నాయి. 2. ఇవి మనకు స్వాభావికంగా వచ్చినవి కావు. మన స్వభావానికి వ్యతిరేకంగా వాటిని చేసేటట్లు అవి మనల్ని సవాలు చేస్తాయి. 3. మనము లోకము లోకాశలకు మించి జీవించాలి. మన చుట్టూ ఉన్నవారి కంటే నిజంగా భిన్నమైన వారంగా, ప్రత్యేకమైన వారంగా జీవించాలి. 4. ప్రతి క్రైస్తవుడు వాటిని సంపూర్ణంగా ఆస్వాదించాలి.

అమెరికన్ ప్రొఫెసర్, రచయిత డగ్లస్ ఆర్. ఏ. హేర్ కొండమీద ప్రసంగం గురించి యేసుక్రీస్తు గురించి చెబుతూ "తన సింహాసనము మీద ఆసీనుడైయున్న ఒక రాజువలె ఆయన కూర్చున్నాడు. ఆయన శిష్యులు ఆయన యొద్దకు ఆయన చేత పరిపాలించబడుచున్న పౌరుల వలె రాజ ప్రాంగణంలోకి వచ్చారు. రాజు తన ప్రారంభ ఉపన్యాసమును వినిపిస్తూ ఆయన రాజ్యంలో ఒకని జీవితం ఎలా ఉంటుందో దానిని చాలినంతగా, క్రమబద్ధంగా విశదీకరించాడు" అని చెప్పాడు.

**ప్రశ్నలు:**

1. ధన్యత అంటే ఏంటి? ఈ లోకంలో ఎవరిని ధన్యులు అని అంటారు?
2. దేవుని దృష్టిలో ధన్యులు ఎవరు? (లూకా 16:15).



3. ధన్యతల్లోని షరతులు, ఫలితాలు ఏంటి?
4. దీనత్వం అంటే ఏంటి? యేసుక్రీస్తు ప్రభువులో ఈ లక్షణాన్ని ఎలా చూడగలం?
5. ఎవరి నిమిత్తం దు:ఖించాలి? ఎందుకు దు:ఖించాలి?
6. సాత్వికాన్ని ఎప్పుడు మన జీవితాల ద్వారా చూపించగలం?
7. 6వ,10వ ప్రకారం నీతిని గూర్చి నిలబడాల్సిన అవసరం ఏంటి?
8. హృదయ శుద్ధిని మన అనుదిన జీవితంలో కలిగి ఉండడానికి ఉపయోగపడే సాధనాలేంటి?
9. సమాధానపరచే వారికి ఉండాల్సిన లక్షణాలు ఏంటి?
10. ఈ ధన్యతలు క్రీస్తు ప్రభుని గుణలక్షణాలు. వీటిని మన జీవితాల్లో ఎలా అనుసరించాలి? ప్రస్తుతం ఆయన గుణలక్షణాలను మన జీవితాల ద్వారా ఎలా చూపించగలం? అలా చూపించడం వలన వచ్చే లాభాలేంటి?

**ముగింపు**

కొండమీద ప్రసంగం అనేకమంది జీవితాల మీద ప్రభావితం చూపించింది. అందులో మన జాతిపిత మహాత్మాగాంధీ ఒకరు. యుఇయస్ఐ పితరులు కూడా మౌళిక విలువలుగా వీటిని తమ జీవితాల్లో పాటించారు. మన జీవితాల్లో కూడా వీటిని అనుసరిస్తూ ప్రభువు రాకడకు మనల్ని మనం సిద్ధం చేసుకొందాం. విద్యార్థులకు మాదిరిగా ఉందాం.

– **యస్.యేసుదాసు,** ఏపి-ఇజియఫ్ స్టాఫ్, వైజాగ్

ప్రత్యేకం



# టీన్స్ పెంపకం ఓ తియ్యని సవాలు

జాన్ తల్లిదండ్రుల కనుసన్నల్లో ఎదుగుతున్నాడు. చర్చ్‌కి వెళ్ళడం, అందరిలా పాటలు, ఆటలు, స్నేహితులు, టీచర్లు అంతా ఇష్టమే. పోయిన వేసవి సెలవుల బైబిల్ తరగతులు, తాను గెల్చుకున్న బహుమానాలు, యేసయ్యకు తన హృదయాన్నివ్వడం ఓహ్... ఆ ఆనందం ఇక చెప్పనక్కర్లేదు. కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఇప్పుడు వయసుతో పాటు పరిస్థితులు మారాయి. తల్లిదండ్రులు, ఇక వీడు తన బాల్య భక్తిలో అలా ఎదుగుతూ పోతాడు అనుకున్నారు. అలా జరగలేదు. కట్ చేస్తే.. మామ్, డాడ్... చర్చ్ జీసస్ ఈ స్టఫ్ మీకు ఓకే. నాకలా అనిపించడం లేదు. ప్లీజ్...నన్ను తొందర పెట్టకండి. ఇదీ జాన్ తీరు. బాలుడు నడవవలసిన త్రోవ వానికి నేర్పిస్తే వాడు పెద్దవాడైనా దాన్నుండి తొలిగిపోడు కదా! (సామె 22:6). మరి ఇలాగైందేంటి? తల్లిదండ్రులు తలలు పట్టుకొని కూర్చున్నారు. ఈ మాటలు మీ భుజాల్ని కూడా తడుముతున్నాయా? లోపమెక్కడుంది? వాక్యంలోనా? మనలోనా?

బిడ్డల్ని పెంచడం ఒక తియ్యని సవాలు. వాళ్ళు టీన్స్ అయితే మరీనూ. వాళ్ళకు క్రైస్తవ తల్లిదండ్రులుగా ఉండడం ఇక వేరే చెప్పాలా? అది సవాలు మీద సవాలే. ఈ అత్యాధునిక యుగంలో తల్లిదండ్రులు పిల్లల్ని, అందునా టీన్స్‌ను పెంచడంలో ఎదుర్కొంటున్న సమస్యలు వాళ్ళ అమ్మానాన్నలు కూడా ఊహించి ఉండరు. టీన్స్ వయస్సు 13-19 సం॥ మధ్య ఉంటుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం 10-19 సం॥ మధ్య ఉన్న వీరి ప్రాయం కౌమారం.

ఏ వయసు వారిని బాలలు అంటాం. యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ది రైట్స్ ఆఫ్ ఛైల్డ్ ప్రకారం ఛైల్డ్ అంటే 18 సం॥ లోపు ఉన్న వాళ్ళు. కాబట్టి అటూ ఇటూగా 18-19 సం॥ వచ్చేవరకు వీళ్ళు బాలలే. ముఖ్యంగా, అంత వరకు తల్లిదండ్రులు బిడ్డల పై బోధనాపరమైన, ప్రవర్తనాపరమైన ఆధ్యాత్మిక మానసిక ప్రభావాన్ని లోతైన రీతిలో చూపుతూనే ఉంటారు.

**టీన్స్ మాటల్లో...**

మీ తల్లిదండ్రులకు మీ మనసులో మాట చెప్పా

లంటే, ఏం చెబుతారు? అని వందలకొద్దీ టీన్స్‌ను డా॥ జేమ్స్ డాబ్సన్ వాకబు చేస్తే, వాళ్ళ జవాబులు ఆశ్చర్యపరచేలా ఉన్నాయి – "దేవుని గురించి, ఆధ్యాత్మిక విషయాల గురించి మాకు బోధించాలి. మాలో చెడునే కాదు, మంచి వాటిని కూడా చూడండి. మా ముందు మీ వివాహాన్ని మాదిరిగా ఉంచి మమ్మల్ని కూడా మంచి వివాహం కోసం గైడ్ చేయండి. మేము మీలా చేయకూడదనుకొంటే మీరు తిట్టడం, సణగడం చేయకూడదు. మాకు సమయమివ్వండి. మాతో ఆటలాడండి. మీరు మమ్మల్ని ప్రేమిస్తున్నారని తరచూ చెప్పండి. చదువుల్లో లేదా ఇతర విషయాల్లో బాగా ముందుండాలని అదేపనిగా ఒత్తిడి చెయ్యకండి. సున్నితమైన అంశాలను గూర్చి మాతో నేరుగా మాట్లాడండి". ప్రియపాఠకులారా ఈ విషయాలను తప్పక ఆలోచించవలసిందే.

## టీన్స్‌ను అర్థం చేసుకొందాం

దేవుడు తన అనంత జ్ఞానంతో మన శరీరాల్లో కొన్ని స్విచ్చులు ఉంచాడు. యుక్తవయసు వచ్చేసరి కి అవి ఆన్ అయ్యి శరీరంలో కొత్త మార్పులు, మనస్సులో కొత్తభావాలు రేకెత్తుతాయి. ఆలోచన, సంభాషణ, పనులు అన్నీ కొత్తపుంతలు తొక్కుతాయి. ఎక్కువ సందేహాలు కలుగుతుంటాయి. ఏకాంత సమయాలను కోరుకుంటారు. ఇంట్లో వారికంటే స్నేహితులకు ఎక్కువ అటెన్షన్ ఇస్తారు. టి.వి.కి అతుక్కుపోతుంటారు. చర్చ్ తదితర భక్తి కార్యక్రమాల మీద శ్రద్ధ సన్నగిల్లవచ్చు. శోధనలు చుట్టూ పొంచి ఉంటాయి. ఈ గుర్తులు చాలు పరిస్థితి చేయి దాటుతుందని నిర్ధారణకు రావడానికి. ఈ ప్రాయంలోనే టీన్స్ తీవ్ర దుర్బలత్వంతో ఉంటారు. వారిపై దాడికి ఇదే అదను అని అపవాదికి కూడా తెలుసు. అందుకే, ఈ సమయంలోనే తల్లిదండ్రుల శ్రద్ధ సహాయం, పరిచర్య అవసరం. టీన్స్ ఎదిగే మొక్కల్లాంటివాళ్ళు. మొక్కలకు మంచి పెంపకం, కత్తిరింపులు, కొన్నిసార్లు తాడుతో కట్టడం ఇవన్నీ అవసరం. లేకపోతే అవి ఎటుపడితే అటు ప్రాకిపోతాయి. అలాగే యుక్త వయస్కుల విషయంలో సున్నితమైన శ్రద్ధ అవసరం. బాలుని హృదయంలో మూఢత్వం స్వాభావికంగా పుట్టును. శిక్షాదండం దానిని దానిలోనుండి తోలివేయును (సామె22:15). వారు త్వరగా ప్రభావితులౌతారు. రోల్ మోడల్స్ కోసం వెదుకుతారు. వారికి అన్ని విషయాల్లో ప్రభువైన యేసుక్రీస్తును రోల్‌మోడల్‌గా వివరిస్తూ వర్తింప చేయాలి....కట్టడలను, నీతి విధులను..నీ కుమారులకును, నీ కుమారుల కుమారులకును నేర్పింపుము..' (ద్వితి 4:8,9).

## టీన్స్‌తో సంభాషిద్దాం

తరచూ సంభాషిద్దాం. మన మాటల్లో యధార్థత ఉండనిద్దాం. వినాల్సివస్తే శ్రద్ధతో ఆసాంతం తల ఊపుతూ కళ్ళలో చూస్తూ విందాం. వివరణ ఇద్దాం. కోరదాం. చివర్లో సంభాషణ సారాంశాన్ని పున:శ్చరణచేసి, దాని పర్యవసానంగా తలెత్తే కార్యాచరణకు ఇరువైపులా కట్టుబడి ఉండేలా పరస్పరం ప్రోత్సహించుకొందాం. స్వభావసిద్ధంగా కొంతమంది టీన్స్ ఎక్కువగా మాట్లాడరు. అలాంటప్పుడు మాట్లాడిన సందర్భాలను మనం తప్పక ఉపయోగించుకోవాలి. కోప్పడినా, శిక్షించినా దానికి కారణం వాళ్ళకు తెలియాలి. అకారణ, అసందర్భ భావావేశాల పట్ల వారికి సున్నితంగా క్షమాపణ చెప్పాలి. చదువనో, బంధువులనో ఏ కారణంతోనైనా ఇంటి బయట ఉంటే వారితో సంభాషిస్తూ ఉండాలి. మన సంభాషణ అంతటిలో క్రీస్తు ప్రభువు కేంద్రంగా ఉండాలి. అన్నింటినీ ఆయనకు ముడిపెట్టాలి. గుణంలో పనుల్లో ఆయన్ను ప్రమాణంగా ఉంచుకొంటున్నామని వారికి తెలియాలి. పరమతండ్రి ప్రతినిధిగా వారియెడల మనం ఉండడానికి సాధన చేస్తున్నామని మనస్సు విప్పి వ్యక్తం చేసుకోవాలి. వారి ఖండనలకు సవరణలకు అభినందనలకు సానుకూలంగా స్పందించాలి. నీవు నీ కుమారులకు వాటిని అభ్యసింపజేసి, నీ యింట కూర్చుండునప్పుడును పండుకొనునప్పుడును లేచునప్పుడును వాటి గూర్చి మాటలాడవలెను (ద్వితీ 6:7).

## టీన్స్ శోధనలు

యుక్తవయస్కుల్లో లైంగిక భావనలు మొగ్గలు తొడిగి విచ్చుకొంటుంది. వాటి గురించిన రాతలు, బొమ్మలు, సంభాషణల పట్ల ఆసక్తి పెరుగుతుంది. తదనుగుణంగా పలు ప్రశ్నలు లేవనెత్తుతారు. విషయపరిజ్ఞానం మంచిదే. అటు వారి ఉత్సుకత అయినా, మన వివరణ అయినా అది వారి వయసు, స్థాయి, సందర్భం అవసరతలకు అనుగుణంగా ఉండేట్లు చూచుకోవాలి. వారి మేల్కొలుపును అణచివేయాల్సిన అవసరంలేదు. వివిధ దశల్లో ఈ

బోధన కొనసాగేటట్లు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. వారి స్నేహాలు (ముఖ్యంగా ఆపోజిట్ జెండర్‌తో), వారు చూసే టి.వి. దృశ్యాలు, బొమ్మలు, చదివే పుస్తకాలు, ఫోన్ సంభాషణలు, ఈ-మెయిల్స్, ఛాటింగ్, బ్రౌజింగ్, వారు ఒంటరిగా ఉన్నప్పుడు చేసే చేష్టలు, శరీరాన్ని దుష్టేచ్ఛకు గురి చేయడం, ఇవన్నీ వారికి శోధన కేంద్రాలు, భ్రష్టత్వానికి బాటలు.

### టీచింగ్ అవసరం

1. దేవుడు వారిని నిర్మించాడని (కీర్తన 139:13), ప్రాణాత్మదేహాల సంపూర్ణతగా (1థెస్స 5:23) చేశాడని, మనలను తన కోసమే దేవుడు చేసుకొన్నాడు కాబట్టి మనం ఆయన ఎదుట పరిశుద్ధులంగా ఉండాలని (ఎఫెసీ 1:4) తెలియజేయాలి.
2. సెక్స్ దేవుని ప్రణాళికలో ఉన్న పరిశుద్ధ వివాహం కోసం భద్రం చేసుకోవాలని (హెబ్రీ 13:4), అతిక్రమణ ఏ రూపంలో ఉన్నా అది పాపమని (1 యోహా 3:4), పాపానికి పర్యవసానాలుంటాయని (రోమా 6:23; ప్రక 22:11,12) చెప్పాలి.
3. పరీక్ష, శోధనల మధ్య వ్యత్యాసం ఉంటుందని (యాకో 1:13-16; 4:7), శోధనలను మనం తప్పించుకోవచ్చని (రోమా 13:14), మనం ఆశిస్తే దేవుడు సహాయం చేస్తారని (1 కొరింథీ 10:13), పరిశుద్ధ జీవితానికి ఫలం ఉంటుందని (ప్రక 3:11) భోధనాత్మకంగా చెబుతూ ఉండాలి.

### మీటింగ్‌లకు పంపితే సరిపోదు

సండేస్కూల్‌కు, యూత్ మీటింగ్‌కు పంపి చేతులు దులుపుకోకూడదు. పిల్లలకు ఈ టీచింగ్ అంతా క్రిష్టియన్ హోంలోనే ఇవ్వాలి. బిడ్డల సమగ్రాభివృద్ధి కోసం తల్లిదండ్రుల ప్రార్థనావిజ్ఞాపనల అవసరత గురించి ఎంత చెప్పినా తక్కువే. అనుదిన కుటుంబ ప్రార్థనల్లో, కుటుంబ భోజన బల్ల చుట్టూ, కుటుంబ ఇష్టాగోష్ఠుల్లో ఈ విలువలు మాట్లాడుకోవాలి. మన గృహమే ఆధ్మాత్మిక రచ్చబండగా తీర్చుదిద్దుకొంటే మన పిల్లలు దారి తొలగిపోయే దారులన్నీ అవే మూసుకు పోతాయి. ఏమంటారు?

– కె. యోహాను, తుని

సాక్ష్యం



## క్రికెటర్ సిటి స్టడ్

### ఆధ్యాత్మిక జీవిత రహస్యము

ఛార్లెస్ స్టడ్ తెల్లవారు జామున 3:30 గం॥లకు లేచి దేవుని సన్నిధిలో గడిపేవాడు. అలా గడపకపోతే "నా స్థితి తల వెంట్రుకలు క్షౌరము చేయబడి బలహీనుడయిన సంసోను స్థితిని పోలియుంటాను" అని చెప్పేవాడు.

### దేవుని పిలుపు

ఒక రోజు స్టడ్ దైవవాక్యాన్ని పఠిస్తుండగా ధనవంతుడైన యువకునికి క్రీస్తు ఇచ్చిన హెచ్చరిక తనకే ఇచ్చినట్లుగా భావించుకొని తనకు కల్గిన సమస్తాన్ని త్యజించి క్రీస్తును వెంబడించడానికి నిర్ణయించుకున్నాడు. 'మీలో తనకు కల్గిన సమస్తమును విడిచిపెట్టని వాడెవడునూ నాకు శిష్యుడు కానేరడనే వాక్యం ద్వారా దేవుడు తనతో మాట్లాడినప్పుడు తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌ను, తన ఆస్తిని విడిచి దేవున్ని వెంబడించాడు.

### నిర్ణయాలు:

దీర్ఘకాలము జీవించాలని ఆశించకు –
క్రీస్తు కొద్దికాలమే జీవించాడు

భోగలాలసుడవై యుండకు –
క్రీస్తు పేదరికములో జీవించి చనిపోయాడు

ఆహ్లాదకరమైన జీవితాన్ని గడపకు –
క్రీస్తు తన్నుతాను సంతోషపెట్టుకోలేదు

పేరు ప్రఖ్యాతులను ప్రేమించ వద్దు –
క్రీస్తు పేరు ప్రఖ్యాతుల్ని ప్రేమించలేదు

సుఖవంతమైన జీవితాన్ని గడపకు –
క్రీసు నీ కొరకు శ్రమపడి కొరడా దెబ్బలతో, సిలువలో అవమానం పొందాడు

– విజె డెస్క్



ప్రత్యేకం

# వారసత్వాన్ని అందించు...

*'మహానుభావుల జీవితాలు గుర్తు చేస్తున్నాయి మనకు, మనం కూడా మన జీవితాలను ఉన్నతమైనవిగా మలచుకోవచ్చుని, కాలమనే ఇసుక మీద మనం కూడా మన పాదముద్రలను విడిచి వెళ్ళగలమని" – లాంగ్‌ఫెలో*

### వారసత్వం అందించుట

'వారసత్వం అందించుట' ను వివరించడానికి చాలా నిర్వచనాలు ఉన్నాయి. 'పూర్వీకుల నుండి లేదా ముందుతరానికి చెందిన వ్యక్తినుండి బదలాయించబడిన లేదా స్వీకరించబడిన ఆస్తి'. నిఘంటువు 'లెగసీ' అను పదాన్ని డబ్బు, ఆస్తిపాస్తులకు మాత్రమే పరిమితం చేస్తుంది. ఇవన్నీ కొలవదగినవి, కనిపించేవి. వారసత్వాన్ని మనం ఈ విధంగా పరిగణిస్తాము – నీవు అందించి వెళ్ళేది – నీ జీవితం, నీ ప్రభావం, నీ సాక్ష్యం. ఇవి రాబోయే తరాల వారిని ప్రభావితం చేస్తాయి. వారసత్వం అనేది అది వదలివెళ్ళిన వ్యక్తి యొక్క లక్షణం, జీవించిన జీవితం మీద ఆధారపడి ఉంటుంది.

### వారసత్వాన్ని అందిచేది ఎవరు?

మాదిరికరమైన వారసత్వాన్ని అందించే వారిని గురించి ఆలోచిస్తే, ముఖ్యంగా....

- ✦ తల్లిదండ్రులు
- ✦ అవ్వ, తాతలు
- ✦ ఉపాధ్యాయులు
- ✦ ఇయు, ఇజియఫ్‌లలో సీనియర్ విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ కన్పిస్తారు.

సీనియర్ విద్యార్థులు, గ్రాడ్యుయేట్లుగా రాబోయే తరాలవారి కొరకు మంచి వారసత్వాన్ని అందించాలనే లక్ష్యంతో మనం ఉండాలి. ఇది తర్వాతి తరానికి అందించే "baton" లాంటిది.

### ఈ పఠనం మనకు ఎలా ఉపయోగపడుతుంది?

1. ఉన్నతమైన దానిమీద దృష్టి ఉంచడానికి, దానిమీదే మన సమయం, సామర్థ్యాలు, వెచ్చించుటకు తోడ్పడుతుంది.
2. దేవునికి గౌరవం, మహిమ తెచ్చే విషయాల మీదనే మన జీవితాన్ని వినియోగించుటకు సహాయ పడుతుంది (మత్తయి 5:16)
3. తమ పిల్లలను మంచి విధానంలో పెంచాలని ఆశించే తల్లిదండ్రులకు మంచి మార్గదర్శకత్వం అవసరం.
4. చెడు వారసత్వానికి ముగింపు పలకడానికి సహాయ పడుతుంది. చెడు లెగసీ చాలా త్వరగా సంక్రమిస్తుంది.
5. మంచి వారసత్వం కోసం శ్రమించాలి, పెంచి, పోషించి, దాన్ని ఇతరులకు అందించడానికి శ్రమించాలి (మన జీవితంలో మనం అల వర్చుకొంటున్న మంచి వారసత్వం ఏంటి?)

### వారసత్వం అందించుట యొక్క ప్రాముఖ్యత

ఈనాటి యువతరం మూర్ఖుడు, బుద్ధిహీనమైన వ్యక్తిని అభిమానించరు. కాని చెడ్డవ్యక్తి తరచుగా మెప్పు పొందుతూ ఉంటాడు. యువతరం ఉన్నతమైన మాదిరినే అంగీకరిస్తుంది. చెడ్డవారి శక్తిముందు భక్తిగల వారు అత్యున్నతమైన ఆధ్యాత్మిక శక్తిని

కనబర్చాలి. ఇది కేవలం ఆధ్యాత్మిక నిజాయితీ ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది. పెద్దవారికి యువకులు పెట్టే అత్యంత కఠినమైన పరీక్ష ఇదే. అంటే విశ్వాసులు ఆధ్యాత్మికంగా బలహీనంగా, నాణ్యతలేని వారిగా ఉండడానికి వీలులేదని దీని అర్థం. మంచితనం, దయ, అనుకూలత వంటి లక్షణాలతోపాటు ఆధ్యాత్మిక శక్తిని కూడా వారు ప్రదర్శించాలి.

మనం ఏమి అందించాం అన్నది మనం ఎలా జీవించామన్న దాని మీద ఆధారపడి ఉంటుంది. మనం ఇప్పుడు జీవిస్తున్న జీవితం మనం చనిపోయిన తర్వాత కూడా జీవిస్తుంది. వారసులు లేకున్నా ప్రతివారు వారసత్వాన్ని అందించి వెళ్తూనే ఉంటారు కాబట్టి...

1. ఒక తరము నుండి తర్వాతి తరానికి అందించబడిన దానిని వారసత్వం అంటారు.
2. నీవు ఈ రోజు ఏమై ఉన్నావో, ఏమి కలిగి ఉన్నావో – మంచిదైనా, చెడ్డదైనా సరే – అది నీ వారసత్వం కాబోతుంది.
3. ఒకరు వదలివెళ్ళిన వారసత్వం వలన వచ్చే లాభం లేదా నష్టం మనందరి మీద ప్రభావం చూపిస్తుంది.
4. మనం వెళ్ళిపోయిన తర్వాత కూడా మన వారసత్వం ఉంటుంది.

వారసత్వాన్ని వివరించడంలో మనకు ఉపయోగపడే మరో పదం generativity. దీని అర్థం రాబోయే శతాబ్దాలలోని భవిష్యత్ తరాల మీద చూపించబోయే ప్రభావం, దీర్ఘకాలిక ప్రణాళిక, దర్శనం.

1. దీర్ఘకాల భవిష్యత్తును చూసిన ఇస్సాకు మరణశయ్య మీదనుండి తన కుమారులను ఆశీర్వదించాడు (ఆది 48:21).
2. హన్నా జీవితం ద్వారా (తన బాధ ద్వారా) దేవుడు ఒక గొప్ప ప్రణాళికను కలిగి ఉన్నాడు. ఆమె జీవితం తర్వాత కూడా చాలా వరకు అది కొనసాగింది.

మనం వెళ్ళిపోయిన తర్వాత కూడా మన జీవితాలు నిలిచి ఉంటాయి. ముందు తరాల వారికి నేను ఏమి అందిస్తున్నాను. నీ పిల్లలకు నీవు వదిలిపెట్టి వెళ్ళాల్సింది ఆస్తి, డబ్బు, ఆప్యాయతతో ఇచ్చే విలువైన వస్తువులు మాత్రమే కాదు. నీవు నిజంగా వదిలి వెళ్ళాల్సింది ప్రేమ, నిత్యత్వంతో ఉండే క్రీస్తు కేంద్రిత జీవితాలను నిర్మించుకోవడానికి నీ వారసులను సంసిద్ధపరిచే దైవసంబంధమైన వారసత్వం.

### ఆదాము అందించిన వారసత్వం



ఏదేను తోటలో దేవునికి అవిధేయత చూపిన ఆదాము ఆ పాపము యొక్క ఫలితాన్ని ప్రతి మానవునికి అందించి వెళ్ళాడు. పాపం చేసే నైజాన్ని మన పితరుడైన ఆదాము నుండి పొందాము. మానవజాతి అంతటికి శాపాన్ని తీసుకొచ్చిన, ఆదాము సంపాదించిన వారసత్వం ఇదే. మన అందరి హృదయాల్లో నివసించే చెడు అందులోనిదే. మనము ఆదాములో చనిపోయాము – అంటే దేవునితో మనకు ఉన్న సంబంధం తెగిపోయింది. 1 కొరింథీ 15:21,22 ప్రకారం "మనుష్యుని ద్వారా మరణం వచ్చెను గనుక మనుష్యుని ద్వారానే మృతుల పునరుత్థానం కలిగెను. ఆదామునందు అందరు ఏలాగు మృతి పొందుచున్నారో, ఆలాగుననే పాపం చేయబద్ధులైయున్నారు, చెడు వైపుకు ఆకర్షించ బడేవారిగా ఉన్నారు. అంతిమంగా దేవుని నుండి దూరమై, మరణించే వారిగా ఉన్నారు.

### ప్రభువైన యేసుక్రీస్తు అందించిన వారసత్వం

పాపక్షమాపణ, క్రీస్తునందు నీతి, క్రీస్తులో బ్రతికింపబడుట, పరిశుద్ధాత్మ అను బహుమానం, శాంతి అనే బహుమానం.

### ఒక మంచి వారసత్వం ఉచితంగా రాదు

నీలో ఒక మంచి దైవలక్షణం ఉన్నంత మాత్రాన అది నీ పిల్లలకు వస్తుంది అని ఖచ్చితంగా చెప్పలేము. ఉదా॥ దావీదు మంచివాడైనా కుటుంబాన్ని నిర్లక్ష్యం చేయడం అన్న చెడు వారసత్వం తన కుమారులను ప్రభావితం చేసింది. ఈ నిర్లక్ష్యం వలన తన పిల్లలకు అత్యంత ప్రాముఖ్యమైన దానిని అందించలేక పోయాడు.

ఉదా: అమ్నోను తన సొంత సోదరి తామారును పాడు చేశాడు.

- అబ్షాలోము తన సహోదరుడైన అమ్నోనును హత్య చేశాడు, తర్వాత అంతర్యుద్ధానికి నాయకత్వం వహించాడు.
- దావీదు బ్రతికి ఉండగానే ఇశ్రాయేలు రాజుగా ఉండడానికి తన కుమారుడైన అదోనియా ప్రయత్నించాడు.
- సొలొమోను అన్య స్త్రీలను వివాహం చేసుకున్నాడు. చివరకు తానే అన్యుల విగ్రహారాధనలో పాల్గొన్నాడు.

మొదటి, రెండవ రాజుల గ్రంథాలలో రాయబడిన యూదారాజుల చరిత్ర అంతాకూడా ఇదే విషయాన్ని మనం చూడగలం (న్యూ థామ్సన్ చైన్ రిఫరెన్స్ బైబిల్‌లో 194వ పేజిలో ఉన్న బబులోనుకు దాస్యత్వానికి ప్రధాన కారణాన్ని తెలియజేసే చార్ట్‌ను చూడుము)

## చెడు వారసత్వానికి అడ్డుకట్ట వేయవచ్చు

మార్పును తెచ్చే ప్రతినిధిగా ఉండడం. చెడు వారసత్వాన్ని రాజైన హిజ్కియా నిరోధించాడు. 2 దిన 29-33. చెడు వారసత్వాన్ని మార్చివేసిన ఒక వ్యక్తి ఈ విధంగా అన్నాడు. "నేను చేసే ప్రతి పని వెనుక ఆలోచనాత్మకమైన నిర్ణయం ఉంటుంది. నా తల్లిదండ్రులు జీవించిన విధానాన్ని నేను అనుసరించకూడదని నేను తీసుకున్న నిర్ణయ ఫలితంగానే ఈ రోజు నా పిల్లలు మంచి ఫలాలు అనుభవిస్తున్నారు".

- శాశ్వత బాధితునిగా నీవు ఉన్నట్లయితే (ఎప్పుడూ అప్పుల్లోనే ఉంటున్నావా?) ఇలాంటి దృక్పథానికి స్వస్తి చెప్పి, విజయవంతమైన తరానికి నీవు బాటలు వేయగలవు.
- సమస్యలకు నిలయమైన కుటుంబాలనుండి వచ్చినట్లయితే, నీ తర్వాత వారికి నిజాయితీని, సంతోష కుటుంబాన్ని వారసత్వంగా ఇవ్వడానికి నిర్ణయించుకో.



## మన బాధ్యత

మనం ఎలాంటివారమైనప్పటికీ తర్వాతి వారికి వారసత్వాన్ని అందించి వెళ్ళాల్సిన బాధ్యత మనమీద ఉంది. మనం ఏమి వదిలి పెడుతున్నాము అన్నది మనకున్న అవకాశాల మీద, దేవుడు మనకు ఇచ్చిన సామర్థ్యాలు, నైపుణ్యాల మీద ఆధార పడుతుంది. నీ వారసత్వం నీ వారసుల జీవితాలను శక్తివంతంగా ప్రభావితం చేస్తుంది. అది నీ పిల్లల పిల్లల జీవితాల్లో కూడా జీవిస్తుంది (2 తిమోతి 1:5).

ఒక మంచి వారసత్వం జీవితంలోని అన్ని విషయాలను ప్రభావితం చేయాలి. అవి ఏంటంటే ఆధ్యాత్మిక, నైతిక, కుటుంబ, ఆర్థిక, సామాజిక, వృత్తి, సాంస్కృతిక, శారీరిక, భావోద్రేక, మేధోసంబంధ, విద్య, ఆరోగ్య విషయాలు.

## ముగింపు

నీ జీవితం పట్ల దేవునికి ఒక ప్రణాళిక ఉంది. ఆ ప్రణాళికను నీ ద్వారా నెరవేర్చాలని దేవుడు ఆశిస్తున్నాడు. మనం వెళ్ళిన తర్వాత అనేక తరాలను ప్రభావితం చేసే గొప్ప వారసత్వాన్ని మనము వదిలి వెళ్ళాలని దేవుని ఉద్దేశం. మనం ఎంతకాలం జీవించామన్నది ముఖ్యంకాదు. మనం మన జీవితాలను ఎలా జీవిస్తున్నామన్నదే ముఖ్యం. నీవు ఎలాంటి వారసత్వాన్ని వదిలిపెట్టాలని అనుకొంటున్నావో తెలుసుకో. దాన్ని ముందు నీ జీవితంలో చూపించు. తర్వాత దాన్ని వారసత్వంగా ఇతరులకు వదిలిపెట్టు. ప్రజలద్వారా వారసత్వం జీవిస్తూనే ఉంటుంది.

**– రాజ్ కుమార్,** చెన్నై

*"ఒక మంచి వారసత్వం జీవితంలోని అన్ని విషయాలను ప్రభావితం చేయాలి. అవి ఏంటంటే ఆధ్యాత్మిక, నైతిక, కుటుంబ, ఆర్థిక, సామాజిక, వృత్తి, సాంస్కృతిక, శారీరక, భావోద్రేక, మేధోసంబంధ, విద్య, ఆరోగ్య విషయాలు."*

సాక్ష్యం

## డిటి క్యాంప్ నా జీవితంలో ఓ

# టర్నింగ్ పాయింట్



నా పేరు కొత్త పరంజ్యోతి, ఒంగోలు ఇయు విద్యార్థిని. క్రైస్తవ కుటుంబంలో పుట్టి పెరిగాను. తల్లిదండ్రులు చిన్నవెంకయ్య, మార్తమ్మ. వీరు ఐపిసి చర్చ్‌లో సేవకులుగా ఉంటున్నారు. నాకు ఒక అన్నయ్య, కాకినాడ దగ్గర ఆదిత్య యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేస్తున్నాడు.

చిన్నప్పటి నుండి క్రైస్తవ కుటుంబంలో పెరిగి నా నిజమైన భక్తిలేక, వేషధారణతో పెరిగాను. నా ఇంటర్మీడియట్‌కి వచ్చేసరికి నా జీవితాన్ని నాశనం చేసుకొన్నాను. 'ప్రేమ' అనే ఉచ్చులో పడ్డాను, చెడుస్నేహాలు కలిగి ఉండడం. అశ్లీలతకు అలవాటు పడడం, వీటన్నిటితో జీవితంపై విరక్తి వచ్చింది. ఒకరోజు రాత్రి మా తండ్రి గారు వాక్యం చెబుతూ "దేవుడు వేశ్యలను అయినా క్షమిస్తాడుగానీ వేషధారులను క్షమించడు" అని చెప్పాడు. ఆ మాటలు నా గుండెను పిండి వేశాయి. ఎందుకంటే ఇంటిలోకి వచ్చినప్పుడు ఒకలా ఉండడం, బయట మరోలా జీవించేవాడిని. ఆ రాత్రి నా పాప జీవితాన్ని దేవుని దగ్గర ఒప్పుకొని విడిచిపెట్టాను. ప్రభువు ఇంటర్‌లో కాలేజ్ సెకండ్ రావడానికి కృప చూపించారు.

తర్వాత బిటెక్ ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో జాయిన్ అయ్యాను. మొదటి సంవత్సరం కాలేజ్ హాస్టల్లో ఉన్నాను. నా రూమ్మేట్స్ చెడు అలవాట్లు కలిగి జీవిస్తూ ఉండేవారు. కోవిడ్ సెలవులు రావడంతో హాస్టల్ ఖాళీ చేస్తుంటే మా రూమ్మేట్స్ 'బ్లాక్ డైమండ్' అని సాక్ష్యం ఇచ్చారు. అంటే ఏంటి అని అడిగితే మేము ఇంత చెడ్డగా ఉన్నా గానీ మా ప్రభావం నీమీద పడకుండా చూసుకొన్నావు అని అన్నారు. దేవుని మహాకృపను బట్టి వారి ప్రభావం నా మీద పడలేదు.

కోవిడ్ సెలవులకు ఇంటికి వచ్చాక ఆన్‌లైన్ క్లాస్‌ల వలన మొబైల్ ఎక్కువగా ఉపయోగించాను. దానివల్ల సోషల్ మీడియాకి ఎక్కువ సమయం కేటాయించడం, మరలా అశ్లీలతకు అలవాటుపడడం, సోషల్ మీడియా మాధ్యమాలలో మాట్లాడకూడనివి మాట్లాడడం మొదలుపెట్టాను. వేషధారణ జీవితం మరలా మొదలయ్యింది. ఇక వీటినుంచి బయటకు రాలేను అని అనుకొంటుండగా ఇయు పరిచయం అయ్యింది. ఎన్నోసార్లు అన్నవాళ్ళు బైబిల్ స్టడీస్‌కి పిలిచేవాళ్ళు గానీ వెళ్ళేవాడిని కాదు. క్రైస్తవ కుటుంబంలో పుట్టిపెరిగాను కాబట్టి వారి కన్నా నాకే ఎక్కువ తెలుసు అని మనసులో అనుకొనేవాడిని.

ఒకరోజు బలవంతంగా అన్నవాళ్ళు నన్ను డిటి క్యాంప్‌కు తీసుకెళ్ళారు. ఆ రోజు మొదటి రాత్రే ప్రభువు నాతో 'నాకువేరుగా ఉండి నీవేమీ చేయలేవు' అని మాట్లాడారు. అప్పటికే డిప్రెషన్, నిరుత్సాహం, పాపభారంతో, వేషధారణతో ఉన్న నాకు విడుదల కలిగింది. నా పాపాన్ని దేవుని దగ్గర ఒప్పుకొని రీ కమిట్ చేసుకొన్నాను. నా హృదయం ఎంతో తేలిక అనిపించింది. డిటి క్యాంప్ అయ్యేసరికి నేను ఇంతవరకు ఎంత వేషధారిగా జీవించానో అర్థమయ్యింది. ఆ క్యాంప్ తర్వాత మారిన జీవితాన్ని నా స్నేహితులు, కుటుంబ సభ్యులు చూశారు. నేను డిటి క్యాంప్‌కు వెళ్ళకపోతే పాత పాప జీవితంలోని ప్రవాహంలో కొట్టుకొని పోయేవాడినని అనుకొంటాను.

గతంలో బైబిల్ చదివేవాడిని కానీ అర్థవంతంగా చదవలేదు. ఏదో ఒక పుస్తకం చదివినట్లు, చదవాలి కాబట్టి చదివేవాడిని. డిటి క్యాంప్‌లో మౌనధ్యాన సమయం నేర్చుకొన్నాను. ప్రతిరోజు ప్రభువు స్వరం

వినడం, నా జీవితంలో తప్పులను సరిచేసుకొంటూ, వాక్యాన్ని నా జీవితానికి అన్వయించుకోవడం ద్వారా గొప్ప మార్పు వచ్చింది.

ఒకరోజు ప్రాక్టికల్ ఎగ్జామ్స్ జరుగుతున్నాయి. అప్పటి వరకు నేను మొబైల్, స్లిప్స్ పెట్టి రాసేవాడిని, ఇప్పుడు రాయకుండా ఉన్నాను. అందరూ నన్ను వింతగా చూశారు. ఎగ్జామ్ అయిన తర్వాత స్నేహితులు దగ్గరికి వచ్చి స్లిప్స్ రాయడం లేదు ఏంటని అడిగితే, "నేను దేవుని బిడ్డను రాయకూడదు" అని ధైర్యంగా చెప్పాను. పరీక్షల్లో ఒకప్పుడు ఫ్రెండ్స్‌కు చూపించడం చేసేవాడిని, కానీ ఇప్పుడు అలా చేయడం లేదు. దేవునికి వ్యతిరేకమైనవన్నీ విడిచి పెట్టడానికి ప్రభువు కృప చూపించాడు.

ఒంగోలు ఐసిఇయు ప్రెసిడెంట్‌గా నా బాధ్యతలు చక్కగా నిర్వర్తించడానికి, క్రమంగా బైబిల్ స్టడీస్‌కి వెళుతూ పరిచర్య బాధ్యతలను చక్కగా నిర్వర్తించడానికి ప్రభువు కృప చూపించాడు. ప్రతి శనివారం కంబైన్డ్ ఫాస్టింగ్ ప్రేయర్స్‌కు హాజరవుతూ ఆ సంవత్సరం కొన్నిచోట్ల కొత్తగా బైబిల్ స్టడీస్ ప్రారంభించాము. కొంతమంది విద్యార్థులను ప్రభువు కొరకు సంపాదించడానికి ప్రభువు కృప చూపించాడు. పరిచర్యలో బిజీగా ఉన్నా చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయలేదు. కష్టపడి, దేవుని మీద ఆధారపడుతూ చదివాను. బిటెక్ నాలుగు సంవత్సరాలు కలిపి 9.02 సిజిపిఏ సంపాదించడానికి ప్రభువు కృపచూపించాడు.

దేవునికి నమ్మకంగా జీవిస్తూ, విద్యార్థి పరిచర్యలో చురుకుగా పాల్గొంటూ, చదువులో రాణిస్తూ, దేవునిలో ఎదుగుతూ ఉండగా దేవుడు ఎన్నో గొప్ప కార్యాలు చేశారు. ఓయన్‌జిసి నేషనల్ లెవల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కి సెలెక్ట్ అయ్యాను. నాలుగు సంవత్సరాలకు 48,000/- ఇచ్చారు. అలాగే ఐఇఇఇ స్టూడెంట్ బ్రాంచ్‌కి రెండు సంవత్సరాలు ఛైర్మన్‌గా పని చేయడానికి కృప చూపించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హార్వార్డ్ యూనివర్శిటీలో యాస్పైర్ లీడర్స్ ప్రోగ్రామ్ పూర్తి చేయడానికి ప్రభువు కృప చూపించాడు.

నేను బిటెక్ చదివేటప్పుడు ఫీజు కట్టలేని పరిస్థితుల్లో మా ఒంగోలు ఇజియఫ్ వారు నాకు ఎంతో సహకరించారు. అప్పుడప్పుడు నా దగ్గర ఖర్చులకు డబ్బులు ఉన్నాయా లేదా అని అన్నవాళ్ళు అడిగిమరీ సహాయం చేసేవాళ్ళు. యంపిసిలలో ఎంతో ప్రోత్సహించారు. దేవుని ప్రేమను చూశాను, అనుభవించాను.

ఇంటర్ వరకు నాకు అంతగా ఇంగ్లీష్ రాదు. ఒంగోలులో పేస్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో బిటెక్ చేరిన తర్వాత కొంతమంది లెక్చరర్స్ చక్కగా ఇంగ్లీష్ మాట్లాడడం చూసి నేను కూడా వారిలా మాట్లాడాలని ఒక సవాలుగా తీసుకొన్నాను. యూట్యూబ్ ఇంగ్లీష్ క్లాసులు చూసి, అద్దం ముందు ప్రాక్టీస్ చేయడం, కాలేజ్‌లో ప్రొఫెసర్స్‌తో ఇంగ్లీష్‌లోనే మాట్లాడడం ఇలా సుమారు 5 నెలలు కృషి చేశాను. దాని వల్ల ఫ్లూయన్సీ వచ్చింది.

బిటెక్ పూర్తవుచుండగా ఉన్నత విద్యకోసం సిద్ధపడుతూ దేవుని చిత్తం ఏంటని దేవునిని అడిగినప్పుడు ఒక దైవజనుని సాక్ష్యం విన్నప్పుడు, మౌనధ్యానం ద్వారా మాట్లాడుతూ వేరే దేశంలో చదువుకోవడానికి ప్రభువు పరిస్థితులను అనుకూల పరిచాడు. నా కుటుంబ పరిస్థితులు, నా నేపథ్యం చూస్తే ఇది అసాధ్యమే, ప్రభువా మీరు వెళ్ళమంటే వెళ్తాను, అయితే మీరే నా అవసరాలు తీర్చాలి, జ్ఞానాన్ని, నడిపింపును ఇవ్వాలని ప్రార్థించాను. నా విషయం మా ఇయు, ఇజియఫ్‌ల్లో ఎంతోగానో ప్రార్థించారు.

ప్రభువు నా మనవి ఆలకించి అన్నిటిని సమకూర్చారు. నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యాను. దాని విలువ 60 లక్షలు. యుకెలో టాప్‌టెన్ యూనివర్శిటీస్‌లో ఒకటైన 'యూనివర్శిటీ ఆఫ్ బ్రిస్టల్‌లో యంయస్సీ బిజినెస్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' కోర్స్ చేయడానికి అడ్మిషన్ వచ్చి, స్కాలర్‌షిప్‌కు కూడా ఎంపికయ్యాను. మా కాలేజి యాజమాన్యం లక్ష రూపాయలు చెక్‌ను అందించారు. ఇద్దరు యంయల్ఏలు 50 వేల బహుమానం అందించారు. మా ఒంగోలు ఇజియఫ్ గ్రాడ్యుయేట్స్‌తో పాటు యుఇయస్ఐలోని గ్రాడ్యుయేట్స్ సహాయం అందించారు. సమస్త ఘనత మహిమ దేవునికే.

ఫైనల్ అవార్డ్ లెటర్ వచ్చింది. వీసా ప్రాసెస్, ప్రయాణం, యుకెలో దేవునికి మహిమకరంగా జీవించేటట్లు ప్రార్థించండి.

**– పరంజ్యోతి,** ఒంగోలు



కథానిక

# ప్రత్యేకముగా జీవించండి

ఉదయం 5గంటలు...

తమ రెండు సంవత్సరాల కుటుంబ జీవితంలో ప్రయాణాలు, అత్యవసరమైన పనులు ఉంటే తప్ప వేకువనే 5గం॥లకు నిద్రలేవడం చాలా అరుదు. ఈ మధ్య కాలంలో రాజీవ్ 5గం॥లకు నిద్రలేవడం చూసి రూతు ఆశ్చర్యపోతుంది. లేచి రాజీవ్ ఏమి చేస్తున్నాడో చూడాలని నిర్ణయించుకొని పక్క రూమ్ డోర్ దగ్గరికి మెల్లగా వెళ్ళి అక్కడి దృశ్యాన్ని చూసి షాకయ్యింది. రూమ్‌లో రాజీవ్ మోకరించి ప్రార్థన చేసుకొంటున్నాడు. అలా ఆశ్చర్యంగా చూస్తూ ఉండగా కొద్ది సేపటికి తన బైబిల్ తెరిచి చదవడం ప్రారంభించాడు. పెళ్ళైన ఈ రెండు సంవత్సరాల్లో రాజీవ్ అలా ప్రార్థన చేసుకొంటే చూడడం మొదటిసారి. రాజీవ్‌ను డిస్ట్రబ్ చేయడం ఇష్టంలేక అక్కడ నుండి వెళ్ళి తన పనుల్లో నిమగ్నమవుతుంది.

రాజీవ్, రూతు నామకార్థ క్రైస్తవ కుటుంబంలో పుట్టి, పెరిగారు. వీరిద్దరికి క్రైస్తవ పద్ధతిలోనే వివాహం జరిగింది. ఆదివారం చర్చ్‌కి అప్పుడప్పుడు వెళ్ళినా, ప్రార్థన చేసుకోవడం, వాక్యం చదువుకోవడం అస్సలు తెలియదు. లోకానుసారమైన జీవితం వీరి సొంతం.

కొద్ది రోజులుగా రూతు రాజీవ్‌ను గమనిస్తూ ఉంది. రాజీవ్‌లో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. సినిమాలు, సీరియల్స్ పూర్తిగా మానేశాడు. బిగ్‌బాస్‌లు, షోలు, స్టేటస్‌లలో సినిమా డైలాగ్స్, సినీ హీరోల ఫొటోలు వంటివి పెట్టడం కూడా మానేశాడు. రాజీవ్‌లో ఇంతమార్పు ఎలా సాధ్యమయ్యింది? అని ఆలోచించడం మొదలు పెట్టింది రూతు.

ఆ రోజు ఆదివారం ఇద్దరూ చర్చ్‌కి వెళ్ళి వచ్చారు. సాయంత్రం సినిమాకి వెళ్ళాలనేది రూతు ప్లాన్. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత 'సాయంత్రం సినిమాకు వెళ్దామా?' అని రూత్ రాజీవ్‌ను అడిగింది. వెంటనే రాజీవ్ వద్దు, నేను దేవున్ని నమ్మాను. లోకం నుంచి, లోక పద్ధతులు, ఆచారాలు, సినిమాలకు దూరంగా ఉండాలి. అయినా సినిమాలలో ఉండేదంతా, కామం, క్రోధం, కక్షలు, కత్తులు నూరుకోవడం తప్పించి ఏమీ ఉండవు. సరదాగా అలా పార్క్, అటునుంచి ఏదైనా హోటల్‌కి వెళ్దామంటే చెప్పు, తీసుకెళ్తాను. అంతేగానీ సినిమా వద్దు అని అంటుండగా ఫోన్ రింగయ్యింది.

రాజీవ్‌లో ఈ మార్పుకు ఒక పక్క సంతోషంగా ఉన్నా మరోవైపు ఇలాంటి సరదాలు పోగొట్టుకొంటానేమోనన్న బాధ రూతుకు ఉంది. ఎలాగైనా రాజీవ్‌లోని మార్పుకు కారణం ఏంటో తెలుసుకొందామని పార్క్‌కు వెళ్ళడానికి సిద్ధపడింది.

పార్క్‌కి వెళ్ళిన కొద్దిసేపటికి పల్లీలు తింటూ రూతు రాజీవ్‌ను ఇలా అడిగింది "రాజీవ్, నీలో చాలా మార్పులు చూస్తున్నాను, చాలా మానేశావు. పొద్దున్నే లేచి ప్రార్థన చేసుకోవడం, బైబిల్ చదువుకోవడం...ఏంటీ మార్పు?"

తన జీవితంలో వచ్చిన మార్పును రూతు గమనించినందుకు రాజీవ్ సంతోషించాడు. రాజీవ్ రూతుతో "నీతో ఇదే విషయం చెప్పాల నుకొంటున్నాను. మా కాలేజీలో విజయ్ అనే సార్ పరిచయమయ్యాడు. ఆయన క్రిష్టియన్. అందరూ మనలాంటి వాళ్ళే కదా అని మొదట్లో అనుకొన్నాను. కానీ కొన్నిరోజులకు అర్థమైంది, ఆయన చాలా ప్రత్యేకంగా ఉన్నాడని. ఆయన మా కాలేజ్‌లో 20 సంవత్సరాల నుండి పని చేస్తున్నాడు. లెక్చరర్‌గా మంచి పేరుంది. బయట కాలేజీల నుంచి ఆయనకు ఎక్కువ జీతం ఇస్తామన్నా ఆయన వెళ్ళలేదు. సాధారణంగా జీతం పెరుగుతుంది అంటే నాలా సంవత్సరానికి 3 కాలేజీలు మారే పరిస్థితులు ఉన్న ఈ రోజుల్లో ఒకే కాలేజీలో అంతకాలం పని చేయడం ఆశ్చర్యమనిపించింది. కొంత పరిచయమైన తర్వాత అడిగాను. ఈ కాలేజీ కంటే మంచి జీతాన్ని, స్థాయిని, కాలేజీలను ఎలా వదులుకున్నారని? అప్పుడు విజయ్ సార్ చెప్పారు "జీతాన్ని బట్టి కాలేజీ మారకూడదు, దేవుని చిత్తమైతేనే మారాలి, దేవుడు నన్ను ఇక్కడ ఉండి పని చేయమన్నాడు. కాబట్టి మిగిలిన వాటి గురించి నేను ఆలోచించడం లేదు" అని చెప్పాడు. దేవుని చిత్తమైతేనే అనే మాట నా హృదయాన్ని తాకింది. ఈ రోజుల్లో కూడా ఇలాంటి వారు ఉంటారా అని అనిపించింది. ప్రత్యేక జీవితం ప్రజల్ని ఆకర్షిస్తుంది అని చర్చ్‌లో పాస్టర్‌గారు చెప్పిన మాట గుర్తుకొచ్చింది.

అప్పటి నుంచి నేను ఆయన్ను ఇంకా ఎక్కువగా గమనించసాగాను. ఆయన ఎప్పుడూ క్లాస్‌కి ఆల స్యంగా వెళ్ళడు. రిజిస్టర్‌లో మావలే దొంగ సంతకాలు పెట్టడు, దొంగ ఖర్చులు రాయడు, డబ్బులకు కక్కుర్తిపడడు, యధార్థంగా ఉంటాడు, తోటివారిని ప్రేమిస్తాడు, సహాయం చేస్తాడు. యాజమాన్యానికి విధేయత చూపుతాడు...అబ్బో చాలా ఉన్నాయిలే. ఒక క్రైస్తవుడు క్రైస్తవునిగా జీవిస్తే విజయ్ సార్‌లా ఉంటాడు అని అర్థమైంది".

ఇంతలో రూతు రాజీవ్ వైపు చూసి, ఆకలిగా ఉంది. లేటవుతుంది. ఏదైనా రెస్టారెంట్‌కి వెళ్దామా? ప్లీజ్...అని అడిగింది. సరేనన్నాడు రాజీవ్. ఇద్దరూ కలిసి రెస్టారెంట్‌కు వెళ్ళి బిర్యాని ఆర్డర్ ఇచ్చారు. బిర్యాని రావడానికి కాస్త టైమ్ పట్టేటట్లు ఉంది.

రాజీవ్ ఇందాక చెప్పడం మధ్యలో ఆపేశావు. కంటిన్యూ చేయి అని అడిగింది రూతు.

ఒక రోజు మేమిద్దరం క్యాంటిన్‌లో కలిశాము. నేను ఆయన్ను కలిసిన ఆనందంలో 'సార్ మీరు చాలా గ్రేట్ అండి. క్రైస్తవుడు ఎలా ఉండాలో అలా ఉన్నారు. నా వల్ల కావడం లేదు' అని అన్నాను.

విజయ్ సార్ ఓ చిరునవ్వు నవ్వి "చూడు రాజీవ్ నేను సాధారణ వ్యక్తినే. నేను యేసుక్రీస్తు ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించాను. ఆయన బిడ్డను. ఆయనకు భయపడతాను. ఆయన ఆదివారానికి మాత్రమే దేవుడు కాదు, అన్ని రోజులకు దేవుడు. అన్ని రోజులు దేవుని భయం కలిగి జీవిస్తాను. ప్రతి ఉదయం నిద్రలేచిన వెంటనే మొదటి సమయాన్ని దేవునికి ఇచ్చి ప్రార్థన చేసుకొని, వాక్యం చదువుకొంటాను. దేవుని వాక్యం ఎలా జీవించాలో నాకు నేర్పిస్తుంది. ప్రార్థన ద్వారా అలా జీవించడానికి దేవుని సహాయాన్ని, శక్తిని పొందుకొంటాను. అవి నా జీవితంలో అత్యంత ప్రాముఖ్యమైనవి".

రాజీవ్ నీవు కూడా ట్రై చేయ్. నా కంటే చక్కగా జీవిస్తావు. ముందు యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించు అంటూ క్లుప్తంగా సువార్తను చెప్పాడు విజయ్ సార్. ఇంకోమాట 'విజయ్ సార్' అని పిల వకు. అన్న అని పిలువు అని చెప్పి క్లాస్‌కు టైమ్ అవుతుందని వెళ్ళిపోయాడు విజయ్ సార్.

అప్పటి నుంచి నాకు అలాంటి జీవితం కావాల నిపించి నేను కూడా అలా చేస్తున్నాను. ఇంతలో బిర్యాని వచ్చింది. మాటలు కట్టిపెట్టి నోటికి పని చెప్పారు.

వారం రోజులు గడిచిపోయాయి....

ఒక రోజు రాజీవ్, తన స్టాఫ్ రూమ్‌లో కూర్చొని కునుకు తీద్దాము అని అనుకొంటుండగా, విజయ్ సార్ తన రూమ్‌కి వచ్చి పక్కనున్న చెక్క స్టూల్ మీద కూర్చొన్నాడు. సార్ తన రూమ్‌కి రావడం ఆశ్చర్యమనిపించింది. సీనియర్ ఫ్యాకల్టీ జూనియర్ రూమ్స్‌కి రారు.

"అన్నా మీరేంటి ఇలా వచ్చారు! ఫోన్ చేస్తే నేనే వచ్చేవాడిని గదా అంటే..."

"ఫర్లేదులే అంటూ...చూడు రాజీవ్ వచ్చే వారంలో సెలవు రోజున ఒక చిన్న ప్రేయర్ మీటింగ్ ఉంది. కుదిరితే కుటుంబంగా వస్తారేమోనని పిలవడానికి వచ్చాను".

రాజీవ్ వాళ్ళు ఆ రోజున టూర్ ప్లాన్ చేసుకొన్నారు. కానీ విజయ్ అన్న పిలిచాడని తప్పకుండా వస్తామని మాటిచ్చాడు.

రూతు కొంత అయిష్టంగానే ఉన్నా, ఆమెకు నచ్చచెప్పి ఇద్దరూ సెలవు రోజున ఆ మీటింగ్‌కు వెళ్ళారు.

9:30కి మీటింగ్ ప్రారంభమయ్యింది. అందరూ నెమ్మదిగా వస్తున్నారు. స్టూడెంట్స్ ఎక్కువమంది ఉన్నారు. పెద్దవాళ్ళు కూడా ఉన్నారు. పనులన్నీ స్టూడెంట్స్ చేస్తున్నారు. రాజీవ్ కన్నులు విజయ్ అన్న ఎక్కడా అని వెదకుతున్నాయి.



ఎక్కడా కన్పించలేదు. వాష్‌రూమ్‌కి వెళ్దామని వెళ్ళాడు. వాష్‌రూమ్‌లో చొక్కా మడతపెట్టి, ప్యాంట్ పైకి లాక్కొని ఒక స్టూడెంట్, ఒక మధ్యవయస్సు ఉన్న వ్యక్తి వాటిని శుభ్రం చేస్తున్నారు. దగ్గరికి వెళ్ళి చూసి రాజీవ్ షాకయ్యాడు. మధ్య వయస్సు వ్యక్తి విజయ్ అన్న.

అన్న మీరేంటి? మీ స్థాయేంటి? ఇలా... అంటుండగా.. విజయ్ అన్న "చూడు రాజీవ్ ఇదేమీ పెద్ద విషయం కాదు. దేవుని పని చేయడానికి ఈ మాత్రం తగ్గించుకోవద్దా? అని చెప్పాడు.

ప్రోగ్రామ్ చక్కగా జరుగుతూ ఉంది. ప్రేమ్ కుమార్ అన్న వాక్యం చెబుతున్నాడు. ఉదయం సెషన్ అయిపోయింది. లంచ్ బ్రేక్ ఇచ్చారు. భోజనాల దగ్గర ఎవరి ప్లేట్ వాళ్ళు తీసుకొని లైన్‌లో నిలబడ్డారు. రాజీవ్‌కు ఇది కొంచెం కష్టంగానే ఉన్నా స్పీకర్‌తో సహా అందరూ అలా నిలబడడం ఆశ్చర్యంగా అనిపించింది. ఇదంతా చూస్తున్న రాజీవ్‌కు ఈ పరిచర్య కొత్తగా అనిపించింది.

ఫైనల్ డివోషన్‌లో రక్షణ అంటే ఏంటో, రక్షణ అవసరత గురించి, రక్షణ లేకపోతే పరిణామాలేంటో ధనవంతుడు, లాజరు సంఘటన ద్వారా ప్రేమ్ కుమార్ అన్న చక్కగా వివరించాడు. రాజీవ్, రూతులు ఇద్దరూ ఎవరికి వాళ్ళు వ్యక్తిగతంగా యేసుక్రీస్తును రక్షకునిగా అంగీకరించారు. వారితో పాటు చాలామంది దేవుని అంగీకరించారు.

సాయంత్రం ప్రోగ్రామ్ అయిన తర్వాత విజయ్ అన్నకు థ్యాంక్స్ చెప్పి ఇద్దరూ ఇంటికి వెళ్ళారు. ఇంటికి వెళ్ళిన తర్వాత ఆరోజు జరిగిన వాష్‌రూమ్ సంఘటన గురించి రాజీవ్ రూతుతో చెప్పగా రూతు ఆశ్చర్యపోయింది. తర్వాత ప్రోగ్రామ్ గురించి, సందేశం, భోజనాల దగ్గర అందరూ లైన్‌లో నిలబడడం, అందరూ ఆప్యాయంగా పలకరించుకోవడం, తగ్గింపు మొదలగు వాటిని చర్చించుకొని సంతోషంగా నిద్రపోయారు.

మరుసటిరోజు రాజీవ్ ఉదయాన్నే లేవగానే, రూతుకూడా నిద్రలేచింది. ఎవరి బైబిల్ వారు తీసుకొని అర్థవంతంగా చదవడం, ప్రార్థన చేసుకోవడం ప్రారంభించారు. వారిద్దరూ దేవునితో సహవాసం ఎలా ఉంటుందో కొద్దికొద్దిగా రుచి చూస్తున్నారు.

మరలా వారం రోజులకు విజయ్ అన్న నుండి రాజీవ్‌కు ఆహ్వానం అందింది. రేపు సాయంత్రం డిన్నర్‌కి మా ఇంటికి రండని ఫోన్‌చేసి చెప్పాడు. రాజీవ్ సరేనన్నాడు. ఇద్దరూ విజయ్ అన్నవాళ్ళ ఇంటికి వెళ్ళారు.

విజయ్ అన్న, అన్నవాళ్ళ భార్య వీరిని సాదరంగా ఇంట్లోకి ఆహ్వానించారు. ఇల్లు చాలా శుభ్రంగా ఉంది, ఖరీదైన సామాన్లు లేవు. చాలా సింపుల్‌గా ఉంది. ఆడంబరాలకు అవకాశమే లేనట్లు విజయ్ అన్న ఉంటారు. ఇల్లూ అలానే ఉంది. వీరికి ఇద్దరు పిల్లలు. హోమ్ వర్క్ చేసుకొంటున్నారు. కాలేజ్ స్టూడెంట్స్ వారి ఇంట్లో ఉన్నారు. మాటల్లో కాలేజీ విద్యార్థులకు బైబిల్ స్టడీ వారి ఇంట్లో జరుగుతుందని తెలిసింది. స్టూడెంట్స్ ఎలాంటి బెరుకు లేకుండా విజయ్ సార్‌ని అన్న, మేడమ్‌ని అక్క అంటూ కలివిడిగా తిరుగుతున్నారు. అన్న, మేడమ్ వారిని ఎంత ప్రేమిస్తున్నారో చూస్తేనే అర్థమవుతుంది. మేడమ్ అందరికీ టీ, స్నాక్స్ ఇచ్చి డిన్నర్ ఏర్పాటు చేస్తుంది. స్టూడెంట్స్ మేడమ్‌కి సహకరిస్తున్నారు.

రాజీవ్ హాలంతా చూస్తున్నాడు. గోడమీద క్యాలెండర్‌పై దృష్టి పడింది "కావున...వారి మధ్యనుండి బయలు వెడలి ప్రత్యేకముగా ఉండుడి" (2 కొరింథీ 6:18) పెద్ద అక్షరాలతో దేవుని వాక్యం కనిపించింది. దాని కింద యుఇయస్ఐ మౌళిక విలువలు అంటూ కొన్ని ఉన్నాయి. వాటిని చదివాడు. అవి అర్థం కాక రాజీవ్ విజయ్ అన్నను అడిగాడు. అన్న క్లుప్తంగా యుఇయస్ఐ పరిచర్య గురించి వివరించి, యుఇయస్ఐలో సభ్యులు ఈ మౌళిక విలువలు పాటించాలని చెప్పాడు. విజయ్ అన్న జీవితంలో ఈ మౌళిక విలువలు ఉన్నాయని రాజీవ్ గమనించాడు.

రెండు వారాల క్రితం వాళ్ళు హాజరైన మీటింగ్ ఎలా ఉంది అని అడుగుతూ చివరికి వారి రక్షణ గూర్చి విజయ్ అన్న అడిగాడు. రాజీవ్, రూతు ఇద్దరూ ఆ ప్రోగ్రామ్ ఎంతో నచ్చిందని చెప్పి ఆ రోజున రక్షణ పొందామని చెప్పారు. విజయ్ అన్న జీవితం వారిని ఎంతో ప్రభావితం చేసిందని చెప్పారు. విజయ్ అన్న ఎంతో సంతోషించాడు. చెబితే వినే రోజులు కాదు, జీవితం ద్వారా చూపిస్తూ ప్రభావితం చేయాల్సిన రోజులివి అని తన మనసులో అనుకొన్నాడు.

అంతలో మేడమ్ వచ్చి డిన్నర్ రెడీ అని చెప్పింది. అందరూ కలిసి డిన్నర్ చేశారు. మేడమ్ రూతులు కొంచెం సేపు వేరే రూమ్‌లో మాట్లాడుకున్నారు.

విజయ్ అన్న ప్రార్థన చేసి మరలా కలుద్దాం అంటూ వీడ్కోలు చెబుతుండగా...రాజీవ్ ఒక్క విషయం అంటూ "అన్నా మా కుటుంబం కూడా మీలా ఉండాలని ఉంది. మమ్మల్ని కూడా మీ సహవాసంలోకి, పరిచర్యలోకి రానిస్తారా?" అంటూ విజయ్ అన్న చేతులు పట్టుకున్నాడు.

"తప్పకుండా తమ్ముడూ" అని విజయ్ అన్న చెప్పాడు.

రాజీవ్, రూతులు ఇద్దరూ సంతోషంగా ఇంటికి వెళ్ళారు. విజయ్ అన్న వీరి గురించి ఇజియఫ్ కమిటీ వారికి చెప్పినప్పుడు వారు సంతోషంగా వీరిని ఇజియఫ్‌కు ఆహ్వానించాలని నిర్ణయించుకొన్నారు.

తర్వాతి రోజుల్లో రాజీవ్, రూతులు ఇయు, ఇజియఫ్, సంఘ పరిచర్యలో చాలా చురుకైన పాత్రను పోషించారు.

**– యం. గాలెయ్య,** భీమవరం

**కవిత**



# (అ) పరిచితులు

అంతా ఓ చోటే కూడుకొంటారు
కలిసే కూర్చుంటారు
కలిసే ఆరాధిస్తారు
కలిసే ప్రసంగాలకు 'ఊ' కొడతారు
కలిసే పాడతారు కూడా

ఏదో తతంగం ముగిసినట్లు
ఏదో ఉపద్రవం ముంచుకొచ్చినట్లు
ఎవరినీ ఆప్యాయంగా పలకరించకుండానే
బండ్లెక్కి తుర్రుమంటారు
బస్సులకేసి పరుగెడుతుంటారు
బరబరా వెళ్ళిపోతుంటారు

కలిసినట్లే కలిసి
మెలిసినట్లే మెలిసి
చూసినట్లే ఉంటుంది...అంతా (అ) పరిచితం
సహవాసానికి అర్థం మారినట్లుంది
సమావేశానికే ప్రాధాన్యత ఎక్కువైనట్లుంది
సహోదర భావం కనుమరుగైనట్లుంది

కొందరేమో తూనీగల పలకరింపులా
అలా కనిపించి ఇలా మాయమవుతుంటారు
కొందరేమో .... చీమల గుసగుసల్లా
అంటీ అంటనట్లు మాట్లాడుతుంటారు
అమాంతం విసిరేసి తప్పుకుంటారు

విద్యార్థులేమో విరివిగా ఉన్నారు
పలకరింపు కోసం పరితపించి పోతున్నారు
ఇట్టి మరణం నుంచి రక్షించేదెవరని
మదిలో మౌనంగా రోదిస్తున్నారు
మళ్ళీ ఒక్కసారి వచ్చి వెళ్ళరా అని
కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు


తక్షణం నేనొక మనిషిని కనుగొనాలి
అతనిలో రక్షణానందం కనబడాలి
ఆప్యాయతనే ఓ జత చేతులుండాలి
ఆత్మీయతతో నిండిన నోరుండాలి
ఆ క్షణమే అతనికి 'విశ్వాసి' అనే పేరు పెట్టాలి

**– జేసన్ బత్తుల,** చీరాల

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No.: **GTR/59/2024-2026**

**Date of Printing: 25-08-2024**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# విద్యార్థి నాయకుడా...

కల్వరి రక్తమే ఇంధనంగా
మండుతున్న సువార్త కాగడాను
ఒక తరం నుండి మరో తరానికి
అందించే పరుగు పందెమిది!

కటిక చీకటి కమ్మిన కడలి కెరటాల్లో
మునిగి పోతున్న విద్యార్థులను
సహవాసపు దోనెలోకి ఎక్కించి
తీరం చేర్చే ప్రయాణమిది!

భారం సారం లేని
భావి పౌరుల బతుకుల మధ్య
సాక్ష్యాన్ని లేవనెత్తుతూ
సమాజాన్ని ప్రభావితం చేసే
ఆధ్యాత్మిక విప్లవమిది!

సశరీరుడైన
సార్వభౌమాధికారి
రక్షణ కార్యాన్ని
సర్వ సృష్టికి
ప్రకటించాలనే ప్రేషిత ఆజ్ఞ ఇది!

చారిత్రక సత్యాల పునాది మీద
మౌళిక విలువల ప్రాకారం కడుతూ
నశించి పోతున్న విద్యార్థుల జీవితాలను
వెలుగులు పంచే దీపాలుగా
శిఖరం మీద నిలబెట్టే పరిశుద్ధ దర్శనమిది!

కార్య సాధనలో కలిగే
ఆటంకాలన్నిటినీ
సర్వాంగ కవచంతో
ఎదిరించే సమయమిది !
బ్రతుకుట క్రీస్తే
చావైతే లాభమని
చాటిచెప్పే
దైవికమైన ధైర్యమిది!!!

– గొంగటి మేరిజాయ్, ఆదోని